నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
మంగళవారం | జులై 30, 2024 | www.navatelangana.com

కోతుల బెడద నుండి కాపాడండి


కోతుల దాడిలో గాయపడ్డ మహిళ

నవతెలంగాణ-భిక్కనూర్

కోతుల బెడద నుండి గ్రామ ప్రజలను కాపాడాలని భిక్కనూరు పట్టణ ప్రజలు గ్రామపంచాయతీ అధికారులను కోరుతున్నారు. సోమవారం భిక్కనూర్ పట్టణంలోని కుమ్మరి గల్లీ కాలనీలో ముగ్గురు మహిళల పై కోతులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. స్థానికులు గమనించి కోతులను వెళ్లగొట్టిన వెళ్ళిపోకుండా ప్రజలపై దాడి చేస్తున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. గాయాలైన వారిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స నిర్వహించి మెరుగైన చికిత్స కోసం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. గ్రామపంచాయతీ అధికారులు పట్టించుకోని కోతుల బెడద నుండి కాలనీవాసులు, పట్టణ ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరుచున్నారు.

నేడు రైతు రుణమాఫీ రెండవ విడత నిధుల విడుదల

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మ కంగా చేపట్టిన రైతు రుణమాఫీ రెండవ విడత నిధులను మంగళవారం (జూలై 30) ఉదయం 11.00 గంటలకు విడుదల చేయనుందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో విడత రుణమాఫీలో 1 లక్ష 50 వేల వరకు రుణం జిల్లా వ్యాప్తంగా 22,868 మంది రైతులున్నారని, వీరి ఖాతాలలో రూ.210 కోట్లు జమ చేయనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, రైతులు, అధికారుల సమక్షంలో రెండో విడత రుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలిపారు. రెండో విడత రుణమాఫీ కార్యక్రమంలో లబ్దిదారులైన రైతులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ, సహకార శాఖల అధికారులు, బ్యాంకర్లు పాల్గొంటారని తెలిపారు.

పంచాయతీ ఎన్నికలకు కసరత్తు

- డాటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ
- పాత పద్ధతిలోనే రిజర్వేషన్లు ?
- ఎన్నికల పనిలో నిమజ్ఞమైన అధికారులు



నవతెలంగాణ-నసురుల్లాబాద్

గ్రామ పంచాయతీ ఎన్నికలకు కసరత్తు మొదలైంది. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రత్యేక సమీక్షలో అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆ దిశగా ఏర్పాట్లను మొదలు పెట్టిందని తెలుస్తుంది. గ్రామ పంచాయతీల్లో వార్డు మ్యాపింగ్, వార్డుల వారీగా ఓట్ల జాబితా తయారీ కోసం డాటా ఎంట్రీ ఆపరేటర్ల(డీఈవో) శిక్షణ షెడ్యూల్‌ను శనివారం ఎన్నికల సంఘం విడుదల చేసిందని మండల పరిషత్ ఓ అధికారి తెలిపారు. ప్రతి జిల్లా నుంచి ఐదుగురు ఆపరేటర్లకు హైదరాబాద్‌లోని డా.మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ(ఎంసీఆర్ హెచ్ఆర్డీ)లో శిక్షణ అందించనుంది. వీరు తిరిగి ఆయా జిల్లాలోని మండలాల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ అందించాల్సి ఉంటుంది.

కామారెడ్డి జిల్లాలోని 23 మండలాల్లోని 526 గ్రామాలు ఉన్నాయి. బాన్సువాడ డివిజన్ పరిధిలోని బీర్కూర్ మండలం పరిధిలోని 17 గ్రామ పంచాయతీలు ఉండగా నసూరుల్లాబాద్ మండలంలో 17 గ్రామ పంచాయతీలు, బాన్సువాడ మండలంలోని 16 గ్రామ పంచాయతీలు 72 వేల మంది ఓటర్లు ఉన్నారు. గతంలో జరిగిన ఎన్నికల విధంగానే పాత రిజర్వేషన్లు ప్రకారమే గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని ఓ మండలం పరిషత్ అధికారి తెలిపారు.

గ్రామాల్లో పేరుకుపోయిన పారిశుధ్యం..

గ్రామ పంచాయతీల్లో ఈ ఏడాది ఫిబ్రవరి 1న సర్పంచులు, పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. అదే నెల 2 నుంచి పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన అమల్లోకి వచ్చింది. ప్రత్యేక అధికారులు తమ శాఖపరమైన సొంత విధులతో పాటు పంచాయతీల్లో సర్పంచుల స్థానంలో అదనంగా పనిచేయాల్సి రావడంతో పాలన పట్టుతప్పింది. ఒక్కో అధికారికి నాలుగైదు పంచాయతీలు అప్పగించడంతో వీరు గ్రామాలకు చుట్టపు చూపుగా వచ్చి వెళుతున్నారు. దీంతో పల్లెల్లో సమస్యలు పేరుకుపో తున్నాయి. పంచాయతీలకు సకాలంలో నిధులు అందడం లేక పోవడంతో గ్రామ పంచాయతీల్లో సమస్యల తిష్ఠ వేశాయి. గత ఆరు మాసాల నుండి ఎలాంటి నిధులు రాకపోవడంతో గ్రామ అభివృద్ధితో పాటు గ్రామపంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు ట్రాక్టర్ డ్రైవర్లు ఇతర సిబ్బందిలకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. జూన్ మాసం నుండి గ్రామంలో పారిశుద్ధ్యం ఎక్కడికి అక్కడ పేరుకుపోయింది.

నిర్వహణ ఖర్చుల కోసం అప్పులు తెస్తున్నామని ఇటీవల ప్రజావాణిలో పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రాలు అందజేయడం గమనార్హం. పాలకవర్గాలు ఉంటే వెనువెంటనే సమస్యల పరిష్కారానికి నిర్ణయాలు తీసుకునేందుకు వీలుంటుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. గ్రామ పంచాయతీ పరిధిలో కనీస సౌకర్యాలను కూడా గ్రామపంచాయతీ సిబ్బంది కల్పించకపోవడంతో ప్రభుత్వంపై ప్రజలు అసహనం వ్యక్తం చేసే పరిస్థితి నెలకొంది. ఈ విషయం రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంది. దీనితో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలను వేగవంతం చేయాలంటూ అధికారులకు ఆదేశించడంతో అధికారులు కిందిస్థాయిస్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. దీనితో గ్రామాల రిజర్వేషన్లు గ్రామపంచాయతీ ఓటర్లు ఇతర ఇతర వివరాలను సేకరించే పనిలో నిమగ్నమై ఉన్నారు.

నేడు జీపీ కార్మికుల చలో హైదరాబాద్

- ప్రతికార్మికుడు హాజరై జయప్రదం చేయాలి : సీఐటీయూ పిలుపు

నవతెలంగాణ-కామారెడ్డి

జీపీ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించి వేతనాలు పెంచాలని తదితర డిమాండ్‌ల సాధన కోసం నేడు(మంగళవారం) జీపీ కార్మికులతో తలపెట్టిన చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్‌గౌడ్, జిల్లా అధ్యక్షులు బాల నర్సులు సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గతంలో బిఆర్ ఎస్ పార్టీ, ఇప్పుడు ఉన్న రాష్ట్రప్రభుత్వం పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పంచాయతీ కార్మికులను అందరినీ పర్మినెంట్ చేయాలని, స్పెషల్ స్టేటస్ కల్పించాలని, వేతనాలు పెంచాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పిఆర్సిలో గ్రామపంచాయతీ కార్మికులను కూడా చేర్చి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు ఇవ్వాలని, జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలను సవరించి ఇవ్వాలని తదితర 11 డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ 30న (నేడు) చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడుతున్నట్టు పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లాలోని ప్రతి మండలం నుండి ప్రతి గ్రామం నుండి వందలాదిగా కార్మికులు హైదరాబాద్‌కు తరలిరావాలని, ఇందిరాపార్క్ వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పోరాటాలు చేస్తే తప్ప మన సమస్యలు పరిష్కారం కావని, ఇప్పటికి అనేకసార్లు సంబంధిత మంత్రి కి వినతి ఇచ్చినా సమస్యలు పరిష్కారం కాలేదని గుర్తు చేశారు. కావున గ్రామపంచాయతీ కార్మికులందరూ తమ బాధ్యతగా భావించి హైదరాబాదుకు తరలిరావాలని పిలుపునిచ్చారు.


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్

నేడు ఆశాల చలో హైదరాబాద్

- జయప్రదం చేయండి : సీఐటీయూ పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్

డిమాండ్‌లు పరిష్కరించాలని కోరుతూ నేడు (మంగళవారం) ఆశాల చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆశ వర్కర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ.. ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఆశాల సమస్యలు పరిష్కరించాలని జూలై 30 న ఛలో హైదరాబాద్ కోటిలో కమిషనర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నా కార్యక్రమానికి ఆశా వర్కర్లు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆశ వర్కర్లకు ఫిక్స్ వేతనం 18000 ఇవ్వాలని ఉద్యోగ భద్రత ఈఎస్ఐపీఎఫ్ సౌకర్యం జీతంలో సగం పింఛన్ వారసత్వం కొనసాగించాలని అన్నారు. కరోనా మహమ్మారి సమయంలో ఆశా వర్కర్లు తమ ప్రాణాలకు పణంగా పెట్టి ప్రజలందరికీ సేవలందించారని, సేవలను గుర్తించి ఆశా వర్కర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికై జులై 30 తారీఖున చలో హైదరాబాద్ ఆశ వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేణుక, సుకన్య స్వప్న, లలిత, సుజాత, శోభ, రేవతి దివ్య సాహిర, హర్ష రేణుక, ఇంద్ర, సిహెచ్ నర్స తదితరులు పాల్గొన్నారు.

అర్బన్‌కు పైస కేటాయించలే

- కనీసం 100 మీటర్ల సీసీ రోడ్డు పోయలే..
- అసెంబ్లీలో ఎమ్మెల్యే ధన్‌పాల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ


మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ అభివృద్ధికి పైసా కేటాయించలేదని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. కనీసం 100 మీటర్ల రోడ్డు వేసిన దాఖలాలు లేవని అన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సేషన్‌లో సోమవారం ధన్‌పాల్ మాట్లాడారు. ఎమ్మెల్యేలు ప్రజలకు ప్రతినిధులని ఓడిపోయిన వారు కాదని ప్రజలు సమస్యలపై తమని అడుగుతారని తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుండి తన నియోజకవర్గం అభివృద్ధికి ఒక్క రూపాయి వచ్చిన పాపాన పోలేదని అన్నారు. అర్బన్ నియోజకవర్గం పైన ఎందుకు వివక్షా అని అన్నారు కొడంగల్ నియోజకవర్గంలో పది శాతం నిధులు తమ నియోజకవర్గానికి ఇచ్చినా నగరం బ్రహ్మాండంగా అభివృద్ధి చెందుతుందని, తన నియోజకవర్గంలో రోడ్స్, డ్రైనేజీ వ్యవస్థలు సరిగా లేక ప్రజలందరు నానా ఇబ్బందులు పడుతు కాలు బయట పెట్టలేని పరిస్థితి ఉందని, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా మా నగర ప్రజల గోసను అర్థం చేసుకొని ఇందూర్ నగర అభివృద్ధికి సరిపడ నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో నాగారంలో 396 ,బైపాస్ లో 252 సాలిసాలని ఇల్లు నిర్మించి వాటిని అర్హులైన వారికీ కేటాయించకుండా అవి శిథిలావస్థలో ఉన్నాయని అన్నారు. గత ప్రభుత్వం ఇష్టానుసారంగా ఎంపిక చేసిన లిస్ట్ రద్దు చేసి నిజమైన అర్హుల జాబితా ఎంపిక చేసి వారికీ ఇండ్లు కేటాయించాలని అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న ఇందిరమ్మ ఇండ్లు కూడా అర్హులైన వారికీ మంజూరు చేయాలనీ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. నిజామాబాదు జిల్లాలో ఎంతో మంది చదువుకున్న యువత ఉపాధి అవకాశాలు లేక గల్ఫ్ దేశాలకు వెళ్లి కుటుంబాలను పోషించుకునే పరిస్థితి ఉందని గత ప్రభుత్వం 45 కోట్ల బడ్జెట్ తో నిర్మించిన ఐటీ హబ్ ను నిర్మించిన ఇందూర్ జిల్లా యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు దక్కడం లేదని ఐ ఐటీ హబ్ లో 680 సీటింగ్ సామర్థ్యం ఉన్న సగానికి పైగ ఖాళీలు ఉన్నాయని, కారణం ప్రముఖ పేరున్న కంపెనీలు లేకపోవడమే అని అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు ఇందూర్ జిల్లాలో ఐటీ హబ్ పైన ప్రతేక దృష్టి పెట్టి లీడింగ్ కంపెనీలు తీసుకొచ్చి, అభివృద్ధి చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం షుగర్ ఫ్యాక్టరీలు తెరుస్తాం అన్నారు కానీ అభివృద్ధికి నిధులు కేటాయించిలేదని జిల్లాలో ఉన్న బోధన్ షుగర్ ఫ్యాక్టరీ, పక్కా జిల్లాలో ఉన్న ముత్యం పేట షుగర్ ఫ్యాక్టరీ తెరవడమే కాకుండా వాటి అభివృద్ధికి సరిపడా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇందూర్ జిల్లాలో ఉన్న తెలంగాణ యూనివర్సిటీ లో నిత్యం సమస్యలే అని విద్యార్థులకు పురుగుల అన్నం పెడుతున్న పరిస్థితి ఉందని యూనివర్సిటీ మౌలిక సౌకర్యాల కల్పనతో పాటు ఇంజినీరింగ్ కళాశాల కూడా మంజూరు చేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

నవతెలంగాణ-బాల్కొండ

ఎస్సారెస్పీ ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరిలో నీటి ప్రవాహం పెరిగింది. దీనితో ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతుంది. ప్రాజెక్టులోకి 17వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో కొనసాగుతున్నట్టు అధికారులు సోమవారం తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 (80.5 టీఎంసీ) అడుగులు కాగా.. ప్రస్తుతం 1075.6 అడుగుల (34.097 టీఎంసీ)నీరు నిల్వ వుంది. 644 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో.. అందులో సరస్వతీ కాలువ ద్వారా 10 క్యూసెక్కులు, ఎవపోరేషన్ 403 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీరు వదులుతున్నట్లు అధికారులు తెలిపారు.

పెండింగ్ బిల్లులను ఇప్పించండి

- జడ్పీటీసీల ఫోరం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఉమ్మన్నగారి మనోహర్ రెడ్డి

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

స్థానిక సంస్థల పెండింగ్ బిల్లులను ఇప్పించాలని కోరుతూ జెడ్పిటిసిల ఫోరం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఉమన్న గారి మనోహర్ రెడ్డి సోమవారం మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలలోపు జడ్పీ, మండల పరిషత్, సర్పంచుల పెండింగ్ బిల్లులను ఇప్పించేలా కృషి చేయాలని అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరారు.


కేటీఆర్‌ను కలిసి వినతి పత్రం సమర్పిస్తున్న జెడ్పిటిసి

'కేంద్ర బడ్జెట్-మధ్యతరగతిపై ప్రభావం' అనే అంశంపై రేపు సెమినార్

నవతెలంగాణ-కంఠేశ్వర్

కేంద్ర బడ్జెట్ మధ్య తరగతిపై ప్రభావం అనే అంశంపై ఈనెల జులై 31 (బుధవారం) సెమినార్ నిర్వహించనున్నట్టు తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్, మధ్యతరగతి ఉద్యోగుల సమన్వయ కమిటీ, మల్లు స్వరాజ్యం మెమోరియల్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు రామ్మోహన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నాందేవ్‌వాడలో గల మల్లు స్వరాజ్యం మెమోరియల్ ట్రస్ట్ భవనం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇన్సూరెన్స్ ఉద్యోగుల జాతీయ నాయకులు కె.వి.వి.ఎస్.ఎన్. రాజు హాజరవుతున్నట్లు తెలిపారు. కావున ఈ సెమినార్ అందరూ హాజరై విజయవంతం చేయవలసిందిగా కోరారు.

బోనాల పండుగ సెలవు అంగన్‌వాడీలకు వర్తించదా..?

- వారు అర్హులు కారా ?
- సీఐటీయూ జిల్లా నాయకులు సురేశ్‌గొండ

నవతెలంగాణ-పిట్లం



బోనాల పండుగ పురస్కరించుకొని ప్రతేటా పండుగ తెల్లారి సోమవారం రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించింది. అయితే తాజాగా ప్రకటించిన సెలవు అంగన్‌వాడీ టీచర్‌లకు, ఆయాలకు వర్తించకపోవడం సరికాదని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షులు సురేశ్‌గొండ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖలకు బోనాల పండుగ సెలవు దినంగా ప్రకటించినప్పటికీ అంగన్‌వాడీ టీచర్‌ల, ఆయాలకు సెలవు ప్రకటించ పోవడం ప్రభుత్వ వైఫల్యమా? శాఖ అధికారుల వైఫల్యమా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ శాఖలలో ఒకటిగా సేవలందిస్తున్న అంగన్‌వాడీలు.. పొద్దస్తమానం చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు ఎనలేని సేవలు అందిస్తున్నప్పటికీ ప్రభుత్వాలు కనీస వేతనం అమలు చేయక నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నాయని మండిపడ్డారు. స్త్రీ శిశుసంక్షేమ శాఖలోని అంగన్వాడీ టీచర్‌ల, హెల్పర్‌లుగా కొనసాగుతున్నప్పటికీ, ప్రభుత్వ పాఠశాలలతో సమానముగా సెలవులు ప్రకటించకపోవడం దారుణమని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల సెలవు దినాలతో సమానంగా అంగన్వాడీ పాఠశాలలకు సెలవులు వర్తింప చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

లంచాలు తీసుకునే అధికారులు తస్మాత్ జాగ్రత్త

- మీ చిట్టా నా దగ్గర ఉంది
- లంచాలు వదిలేయండి.. లేదా నియోజకర్గాన్ని వీడండి
- ఎమ్మెల్యే లక్ష్మీకాంత్‌రావు ఫైర్

నవతెలంగాణ-జుక్కల్



రెవెన్యూ శాఖతో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో పలువురు అధికారులు లంచాలు ఇవ్వనిదే పనులు చేపట్టడం లేదని తన దృష్టికి వచ్చిట్టు ఎమ్మెల్యే తోటలక్ష్మీకాంత్‌రావు తెలిపారు. లంచాలు తీసుకునే సదరు అధికారుల చిట్టా తన వద్ద ఉందని.. ఇక మీదట జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. సోమవారం ఓ వీడియోలో మాట్లాడి సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా వీడియోలో నియోజకవర్గ ప్రజలకు సందేశం వినిపించారు. ప్రభుత్వ శాఖలలో అవినీతి ఎక్కువైందని, కొందరు అధికారులు లంచాలు ఇవ్వనిదే పనులు చేయడం లేదని అందులో రెవెన్యూ విభాగంలో పలువురు అధికారులు ఎక్కువగా లంచాలు వసూలు చేస్తున్నట్టు తన దృష్టికి వచ్చినట్టు తెలిపారు. ఇది చాలా విచారకరంగా భావి స్తు న్నట్టు తెలిపారు.

చిన్న, సన్నకారు రైతులు, పట్టాదారులు అన్నదమ్ముల పంపకాలు చేసినవి, తల్లి, తండ్రీ చనిపోయిన తరువాత లేదా బతికి ఉండగా వారసుల పేర్లమీద మార్పిడి చేయడానికి చేస్తున్న వాటికి, రెండు మూడు గుంటలు ఇలా తక్కువ భూమీ కలిగి ఉన్న వారది మార్పిడి చేసేందుకు దండీగా రైతుల నుంచి లంచాలు డిమాండ్ చేస్తున్నట్టు సమాచారం వచ్చినట్టు తెలిపారు. డబ్బులు ఇస్తేనే మార్పులు, చేర్పులు చేస్తామని, పని చేసిన దానికి భారీగా లంచం రూపంలో వసూళ్లకు పాల్పడుకున్నారని రైతులు, తనప్రాణసమానులైన కార్యకర్తలు నేరుగా తనకే ఫిర్యాదు రూపంలో తెలిపారని వెల్లడించారు. అధికారులు ప్రభూత్వం జీతాలు తీసుకుని ఇదేం పిచ్చి పని అని, ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు సహాయకులుగా ఉండాలని, సేవాచేయాలన్నారు. మీకు వచ్చే జీతం సరిపోకుంటే వెంటనే రాజీనామా చేసి మీకు తగ్గ ఇతర ఉద్యోగం చూసుకోవాలని సూచించారు. లేకుంటే ఇక్కడి నుండి వేరే దగ్గరికి వెళ్లాలని సూచించారు. నిజాయితీగా పని చేసే వారుండాలని స్పష్టం చేశారు. రెవెన్యూ శాఖలో లంచాలు తీసుకుంటున్న వారి వివరాలు తన దగ్గర ఉన్నాయని, ఇకనైనా పద్ధతి మార్చుకోవాలని స్పష్టం చేశారు. లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎమ్మెల్యే ఆదేశాలు అధికారులు పాటించేనా..?

పెద్దకొడప్‌గల్ : జుక్కల్ నియోజకవర్గ శాసన సభ్యులు తోట లక్ష్మీకాంత్ దృష్టికి నియోజకవర్గంలో ఉన్న రెవెన్యూశాఖలో కొంత మంది అదికారులు లంచం తీసుకుంటూనట్లు ఆయన దృష్టికి రావడంతో పత్రిక ప్రకటన విడుదల చేశారు. దీంతోనైనా అధికారుల తీరులో మార్పు వచ్చేనా అని ప్రజలు సందేహం వ్యక్తం చేస్తున్నారు. లంచం తీసుకుంటున్న అధికారుల చిట్ట తన వద్ద ఉందని అంటే జుక్కల్ నియోజకవర్గంలో అధికారులు లంచం తీసుకోవడంలో ఏ స్థాయికి చేరారో అంటే దీన్ని బట్టి అర్థం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ శాఖలో ఏ చిన్న పనులు జరగలన్న లంచం లేనిదే ఫైలు ముందుకు కదలని పరిస్థితి. లంచం ఇవ్వకుంటే పని నిమిత్తం వచ్చిన జనాలు చెప్పులు అరిగెల తీరగలిసిందే అని అంటున్నారు జనాలు. అంతే కాకుండా మండలంలోని పలుశాఖలో జనాల నుండి భారీగా లంచం తీసుకుంటూ పనులు చేస్తున్నారు. లంచం ఇచ్చినట్లు బయట పొక్కకుండా పలు జాగ్రత్తలు తీసుకుంటు లంచం ఇచ్చినట్లు ఎక్కడ చెప్పిన మీ పనులు మాత్రం జరగవు అనే భయం కూడా పెడ్తున్నట్లు వినికిడి. ఒక వేళ బయట చేపితే తమ పనులు ఎక్కడ ఆగిపోతాదో అనే భయం కూడా నెలకొంది. ఎమ్మెల్యే చెప్పినట్లు అధికారులు జనాల నుండి లంచం తీసుకోకుండా పనులు చేస్తారా.. లేదా.. వేచి చూడాల్సిందే అని జనాల వాదన.

విస్తృతంగా వాహనాల తనిఖీ

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని కిసాన్ నగర్ గ్రామంలో సోమవారం బాల్కొండ ఎస్ఐ మొహమ్మద్ యాసీర్ అరాఫత్ ఆధ్వర్యంలో విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించారు. ఎస్ఐ మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపవద్దని, మద్యం సేవించి వాహనం నడిపిన చట్టమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సరైన వాహనాల పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీలో పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ జయవంతరావు, కానిస్టేబుల్ సదానంద్, సాయికుమార్ పాల్గొన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ

ప్రమాదకరంగా సాటాపూర్ రోడ్డు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ సమీపంలో ఉన్న రోడ్డు గుంతల మయమై ద్విచక్ర వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. సాటాపూర్ నుంచి బోధన్ వెళ్లే రోడ్డు గుంతల మయమైంది. వాటిలో నీరు నిల్వ ఉండడంతో ప్రయాణికులకు తెలియక ప్రమాదాలకు గురి అవుతున్నారు. రోడ్డు మధ్యలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి నీరు నిండిపోవడంతో వారు వెళ్లడానికి నానా అవస్థలు పడాల్సి వస్తుంది. సంబంధిత రోడ్డు భవనాల శాఖ అధికారులు వెంటనే స్పందించి గుంతలను పూడ్చాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదకంగా మారిన్న రోడ్డు

ఎస్ఐపై వేటు

- **డయల్ 100 కాల్‌పై నిర్లక్ష్యం చేసినందుకే..**

నవతెలంగాణ-కంఠేశ్వర్

డయల్ 100 కాల్ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఓ ఎస్సైపై వేటు పడింది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఐదవ పోలీస్ స్టేషన్ ఎస్సై అశోక్‌ను హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేస్తూ నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. టౌన్ పరిధిలో జరిగిన ఒక ఘటనకు సంబంధించి 100 ఫోన్ కాల్ వచ్చింది. ఆ కాల్‌కు సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్ఐ నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు సీపీ గుర్తించారు. అందుకే 5వ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో బాధ్యతల నుంచి తప్పించారు. అయితే ఈయన గతంలోనూ రెండో టౌన్ ఎస్సైగా పనిచేసిన సమయంలో కూడా ఇలాగే హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ అయ్యారు. దీంతో రెండోసారి తన విధుల్లో నిర్లక్ష్యం వహించారు. ఎవరైనా తమ విధులకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సీరియస్‌గా చర్యలు ఉంటాయని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ వెల్లడించారు.

వినియోగదారులపై అధిక ధరలతో ప్రభావం

- **నిజామాబాద్ వినియోగదారుల సంక్షేమ సమితి**



మాట్లాడుతున్న వినియోగదారుల సంక్షేమ సమితి సభ్యులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

దేశంలోని సుమారు (140) కోట్ల వినియోగదారులను అధిక ధరలతో ప్రభావితం చేస్తున్న ప్రధాన సమస్య పెట్రోల్, డీజిల్ ధరలేనని నిజామాబాద్ వినియోగదారుల సంక్షేమ సమితి సభ్యులు అన్నారు. నిజామాబాద్ వినియోగదారుల సంక్షేమ సమితి సమావేశం సోమవారం నగరంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలో వివిధ రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ప్రజా సంక్షేమం దృష్ట్యా ప్రవేశ పెడుతున్న బడ్జెట్‌పై వినియోగదారుల సంఘాలు విశ్లేషణ, విమర్శలకు వెళ్ళడం లేదని అన్నారు. భారత దేశంలో ఒకే పన్ను విధానం జీఎస్టిని అమలులోకి తెచ్చిన ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్ ధరలను జీఎస్టి పరిధిలోకి తెచ్చి, పన్నుల భారాన్ని తగ్గించుకునేందుకు ఏ ప్రభుత్వం ముందుకు రాకపోవడం వినియోగదారుల సంక్షేమం, రక్షణకు తీవ్ర విఘాతమేనని అన్నారు. అందరూ వినియోగదారులే, అన్ని రాజకీయ పార్టీల సభ్యులు వినియోగదారులేనని మరిచి పోవద్దని తెలిపారు. అతి పెద్ద వినియోగదారుల సమస్య అయిన పెట్రోల్, డీజిల్ ధరలపై సెప్టెంబర్‌లో జరిగే వినియోగదారుల జాతీయ సమావేశాల్లో తీర్మానం ఆమోదం కోసం చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పెందోట అనిల్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్, జిల్లా ఉపాధ్యక్షులు వర్మ, గైని రత్నయ్య, సంయుక్త కార్యదర్శులు గడప రవి కుమార్, కి.సాయిరెడ్డి, బానోత్ సందీప్, ప్రవళిక గౌడ్ పాల్గొన్నారు.

వెటర్నరీ అసిస్టెంట్‌కు ఘనంగా వీడ్కోలు



వెటర్నరీ అసిస్టెంట్‌ను సన్మానిస్తున్న పశు వైద్యాధికారులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలకేంద్రంలోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న ప్రవీణ్ రెడ్డికి కార్యాలయ సిబ్బంది సోమవారం వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రవీణ్ రెడ్డి జగిత్యాల జిల్లా కల్లెడ పశుసంవర్ధక శాఖ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా మండల పశు వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్ రావు ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది వెటర్నరీ అసిస్టెంట్ ప్రవీణ్ రెడ్డిని ఘనంగా సన్మానించారు.శాలువాతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ కమ్మర్ పల్లి లో ఆరు సంవత్సరాలుగా వెటర్నరీ విధులు నిర్వర్తించి సేవలందించడం ఆనందంగా ఉందన్నారు. ఆప్యాయంగా ఆదరించిన గొర్రెలు, మేకల పెంపకం దారులకు, సన్నిహితులకు ధన్యవాదాలు తెలిపారు. ఆరు సంవత్సరాలు ఇంటికి దూరంగా ఉన్నాననే భావన కలగకుండా సొంత మనిషిగా చూసుకున్న కమ్మర్ పల్లి గ్రామస్తులకు, తన వృత్తిలో ఎలాంటి ఆటంకం లేకుండా సహాయ సహకారాలు అందించి వెన్నంటి ఉండి ప్రోత్సహించిన అధికారులకు, తోటి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కమ్మర్ పల్లి జీవితంలో మర్చిపోలేని ఎన్నో జ్ఞాపకాలను తనకు అందించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ కార్యాలయ సిబ్బంది స్వప్న, జమీల్, స్వరన్, లక్ష్మి, స్వప్న గంగవ్వ, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసానికి యత్నం

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని సింగంపల్లి గ్రామానికి చెందిన దేశాల భూమేష్‌కు శుక్రవారం వాట్సప్ కాల్ ద్వారా ఒక అగంతక వ్యక్తి తాను సిబిఐ ఆఫీసర్ నని చెబుతూ ఫోన్ వచ్చింది. తన మేనకోడలు మాదకద్రవ్యాల కేసులో ఇరుక్కున్నదని, ఆమెను ఆ కేసు నుండి తప్పించాలంటే 50 వేల రూపాయలు తాను చెప్పిన విధంగా పంపాలని, లేదంటే తన మేనకోడల్ని చంపేస్తానని బెదిరించాడు. వెంటనే భూమేష్ తన మేనకోడలికి ఫోన్ చేయగా తాను ఇంటి వద్దనే ఉన్నానని, ఎటువంటి కేసులో ఇరుక్కోలేదని చెప్పింది. ఎవరో గుర్తు తెలియని వ్యక్తి తనను మోసం చేయాలని సిబిఐ ఆఫీసర్ అని అబద్ధం చెప్పి డబ్బులను తీసుకోవడానికి ప్రయత్నించాడని మోపాల్ పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభిస్తున్నట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. అయితే ఇలాంటి కాల్స్ పట్ల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా ఫోన్ చేసి తన కుటుంబ సభ్యులు గాని బంధువులు గాని కేసులలో ఇరుక్కున్నారని చెప్పి డబ్బులు అడిగితే వెంటనే డయాల్ 100, 1930 లేదా స్థానిక పోలీస్ స్టేషన్ లో, సంప్రదించాలని అన్నారు. సైబర్ నేరాలకు గురి కావద్దని, ఎలాంటి భయాలకు గురి కావద్దని ఎస్ఐ సూచించారు.

సిరికొండ, తూంపల్లి సహకార సంఘం రైతులకు

రుణమాఫీని వర్తింపచేయాలి

- **సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్**
- **కంప్యూటర్లో ఆన్లైన్ చేయకపోవడం వల్లే**

నవతెలంగాణ-సిరికొండ



మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు

సొసైటీ అధికారుల నిర్లక్ష్యం వల్ల నష్టపోయిన సిరికొండ, తూంపల్లి సహకార సంఘం రైతులకు తక్షణమే రుణమాఫీని అందేలాగా చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్ మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ప్రెస్ మీట్ ను నిర్వహించారు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరికొండ, తూంపల్లి సొసైటీల్లో గల అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా నిర్లక్ష్యం వహించడంతో అప్పులు పొందిన రైతుల పేర్లను కంప్యూటర్లో ఆన్లైన్ చేయకపోవడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రుణమాఫీ పథకం సొసైటీ రైతులకు అందని ద్రాక్షగా మిగిలిపోయిందన్నారు. సిరికొండ, తూంపల్లి సొసైటీల పరిధిలోని దాదాపుగా 20గ్రామాల్లో సుమారుగా 152 మంది రైతులకు సహకార సంఘంలోని అధికారుల అలసత్వం వల్ల రుణమాఫీకి నోచుకోకుండా పోయారని అన్నారు. తమ లోన్ ఎకౌంట్లు ఆన్లైన్ కాలేక రుణ మాఫీ తమకు అవ్వలేదని తెలుసుకొని రైతులు తీవ్ర నిరాశకు గుంరయ్యారన్నారుం. సిరికొండ సొసైటీలో ఉన్న అధికారులు 900 కు పైగా వరి ధాన్యం బస్తాలను మింగేయ్యడం వల్లనే మాయం అయ్యాయని, ఈ విషయాన్ని తప్పుడు డాక్యుమెంట్స్ పెట్టి క్లీన్ చీట్‌గా ఇప్పించుకున్నారని, విచారణలో సైతం దొరకకుండా అనేక డబ్బులు నొక్కాశారని అన్నారు. సిరికొండ, తూంపల్లి, ఒన్నాజీపేట సొసైటీల్లో అవినీతి రాజ్యం ఏలుతుందని ఆరోపణలు ఉన్నా జిల్లా స్థాయి సొసైటీ అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుందని తెలిపారు. ఇప్పటికైనా సిరికొండ తూంపల్లిలోని సొసైటీల్లో ఎలాంటి కట్ ఆఫ్ డేట్ లేకుండా అప్పులు తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ వర్తింప చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నిర్లక్ష్యం వహించిన అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక శాసనసభ్యులు ప్రత్యేక దృష్టి సారించి సొసైటీల రైతులకు రుణాలు కూడా ప్రభుత్వం మాఫీ చేసేలా కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ నాయకులు దామోదర్, సిరికొండ మండల నాయకులు అనిస్, పీడీఎస్‌యూ ఆర్మూర్ డివిజన్ నాయకులు అశిస్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

- **లేఖలో ఓరైతు విన్నపం**
- **మానవ హక్కుల కమిషన్, ఎస్సీ, ఎస్సీ హక్కుల జాతీయ కమిషన్‌కు స్పీడ్ పోస్టు**

నవతెలంగాణ-ఎడపల్లి



రైతు మాల పెద్దులు

నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం మంగళ్ పహాడ్ గ్రామానికి చెందిన ఘటక చిన్న సాయిలుకు డిసిసిబి అధికారులు లక్ష 20 వేల రూపాయలను మంజూరు చేసుకున్నారని ఆరోపిస్తూ బాధిత రైతు మాల పెద్దులు ఎడపల్లి సహకర సంఘం కార్యదర్శి రాజారాం పనితీరుపై సోమవారం మానవ హక్కుల కమిషన్, అలాగే ఎస్సీ, ఎస్టీ జాతీయ కమిషన్ ఉన్నత అధికారులకు వేరువేరుగా స్పీడ్ పోస్ట్ ద్వారా ఫిర్యాదు చేశారు. రైతు మాల పెద్దలు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రాథమిక సహకార పరపతి సంఘం-ఎడపల్లి కార్యదర్శి రాజారాం ప్రభుత్వం నుండి లక్ష లోపు రుణమాఫీ కాకుండా చేసినందున, ఆయనకు సహకరించిన అధికారులపైనా విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం మంగల్‌పహాడ్ గ్రామానికి చెందిన మాలపెద్దలు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఎడపల్లి బ్రాంచ్‌లో క్రాప్‌లోన్ రూ.59,588, సహకార సంఘంలో క్రాప్‌లోన్ 6169 రూపాయలు తీసుకున్నారు. ఆయన భార్య గంగామణి పేరిట ఎడపల్లి ప్రాథమిక సహకార సంఘంలో రూ.3624 లోన్ తీసుకున్నారు. మంగళ్ పాడ్ కెనరా బ్యాంక్ బ్రాంచ్‌లో క్రాప్ లోన్ 28,659 తీసుకున్నారు. 98,040, రుణం తీసుకున్నారు.

తనకు తెలియకుండా తన రేషన్ కార్డు, ఆధార్ కార్డు నంబర్‌తో ఘటక చిన్న సాయిలు ప్రాథమిక వ్యవసాయ శాఖ పరపతి సంఘంలో రూ.1,20,040 క్రాప్‌లోన్ తీసుకున్నారని తెలిపారు. ఈ లోను కలుపుకుంటే మొత్తం 2,18,087లుగా ఉందని అన్నారు. అధికారులు ప్రభుత్వానికి తప్పుడు లెక్కలు చూపించి రుణమాఫీ కాకుండా తనను అనర్హుడిగా చేశారని, తన హక్కులకు భంగం కలిగించారని పెద్దులు ఆవేదన వ్యక్తం చేశారు. తన పేరున మరొకరికి లోన్ ఇచ్చిన సహకార సంఘం ఎడపల్లి బ్రాంచ్ కార్యదర్శి రాజారాంపై, సహకరించిన అధికారులపై న్యాయ విచారణ చేయాలని కోరారు. 98,040 రుణాన్ని మాఫీ చేయాలని లేఖలో విన్నవించారు. దీనిపై కలెక్టర్, డిసిఓ శ్రీనివాస్‌కు మంగళవారం ఫిర్యాదు చేయనున్నట్లు రైతు మాల పెద్దులు తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే డ్రైనేజీ వ్యవస్థ వైఫల్యం

- **సీపీఐ**

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రధాన నగరాల్లో డ్రైనేజీ వ్యవస్థ వైఫల్యం చెందిందని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. చిన్నపాటి వర్షానికే వర్షపు నీరు ఇండ్లలోకి, అపార్ట్మెంట్లోకి చేరడంతో వరదగా మారుతున్నది డ్రైనేజీ వ్యవస్థ ప్రభుత్వ అంచనాల ప్రకారం ఉన్నప్పటికీ కొద్దిమంది టౌన్ ప్లానింగ్ అధికారులు కొత్తగా నిర్మించుకునే అపార్ట్మెంట్, చిన్న పరిశ్రమలకు ఇష్టారీతిన నిర్మాణాలకు అనుమతి ఇవ్వడం మూలంగా నాలాలు, పెద్ద పెద్ద డ్రైనేజీలు మూసుకుపోయి చిన్నపాటి వర్షానికి చిన్నభిన్నం చేస్తున్నాయని తెలిపారు. నిన్న ఢిల్లీలో ముగ్గురు సివిల్స్ ఆశావాహులు జల సమాధి కావడం బాధాకరమని, ఈ ఘటనకు కారకులైన వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మున్సిపల్ నాలా, డ్రైనేజీ వ్యవస్థగా ఉండే విధంగా చూడాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉన్నదని అన్నారు.

ఎల్ఓసి అందజేత

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కోనసముందర్ గ్రామానికి చెందిన ఎం.జయవంత్ ఇటీవల యాక్సిడెంట్ కు గురై హైదరాబాదులోని నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. చికిత్సకు పెద్ద మొత్తంలో ఖర్చు అవుతుండడంతో కుటుంబ సభ్యులు స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్‌ను సంప్రదించారు. స్పందించిన ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.2 లక్షల 50వేల ఎల్ఓసి మంజూరు చేయించారు. ఎల్ఓసి పత్రాన్ని సోమవారం బాధితుల కుటుంబ సభ్యులకు అందజేశారు.

దాడి చేసిన వ్యక్తులను శిక్షించాలి

- **రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు**

నవతెలంగాణ-ఆర్మూర్



మాట్లాడుతున్న పల్లపు వెంకటేష్

నందిపేట్ మండలం తల్వేద గ్రామంలో మాదిగ కులానికి చెందిన పెద్ద పెద్దన్న పై దాడి చేయించిన ఆవుల పురం సాయిరెడ్డిని, ఇతరులను వెంటనే అరెస్టు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఐ(ఎం) డివిజన్ కార్యదర్శి పల్లెపు వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి దాసు, ఆల్ ఇండియా అంబేద్కర్ జన సంఘం జిల్లా అధ్యక్షులు మూగ ప్రభాకర్, ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షుడు సూర్య శివాజీ, నిర్మల్ జిల్లా వాసా కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మురళి మాట్లాడారు. నందిపేట మండలం తల్వేద గ్రామానికి చెందిన ఎస్సీ మాదిగ పెద్ద పెద్దన్నపై దాడి చేసిన ఆవులరం సాయి రెడ్డిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. 2023 వ సంవత్సరం నుంచి పెద్ద పెద్దన్న తన పొలంలో నుండి దారి వేసుకొని వేధిస్తున్నారని ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోకపోవడం సిగ్గుచేటని అన్నారు. తన పొలంలో నాటు వేయకుండా పెద్దన్న బోరులో రాళ్లు వేసి వైర్లు కాలబెట్టి పైపులను ధ్వంసం చేశారని, తనకు ప్రాణం ఉంది అని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని అన్నారు. 2023లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు బుక్ చేసిన విచారణ జరుపకుండా.. నోటీసు ఇవ్వకుండా.. సాక్ష్యాలు లేవని కేసును క్లోజ్ చేశారని తెలిపారు. ఈనెల 5న పెద్ద పెద్దన్నను తన పొలంలో నుండి దారి సమస్య పరిష్కారం చేసుకుందామని రమ్మని చెప్పి పథకం ప్రకారం హత్యకు ప్రయత్నించారని అన్నారు. ఈదాడిలో పెద్ద పెద్దన్న వెన్నుపూస రెండు చోట్ల విరిగి హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. దాడి చేశారని బాధితుడు పెద్ద పెద్దన్న విన్నవించుకున్నా పోలీసులు విచారణ జరపకుండా ఆవులపురం సాయిరెడ్డిని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయకుండా తప్పించాలని చూస్తున్నారని అన్నారు. వెంటనే పోలీసులు ఆవులపురం సాయిరెడ్డిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నిజాంబాద్ జిల్లా ఇన్చార్జి మోతే భూమన్న, రైతు కూలీ సంఘం నాయకులు పి.గంగాధర్, నారాయణ, కిషన్, శ్రావణ్ కుమార్, లక్ష్మణ్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇండ్లకు మోక్షం ఎన్నడో?



శిథిలావస్థకు చేరిన డబుల్ ఇండ్లు

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ మండలం కళ్యాపూర్ గ్రామంలో రెండు పడకల గదుల ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. కానీ ఇంతవరకు కేటాయించకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కల్యాపూర్ గ్రామంలో 30 రెండు పడకల గదుల నిర్మాణాలు పూర్తయినా లబ్ధిదారులకు కేటాయించడంతో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. నిర్మాణాలు పూర్తి అయిన ఈ భవనాలు శిథిలావస్థకు చేరే అవకాశం ఉంది. త్వరగా లబ్ధిదారులను ఎంపిక చేసి వాటిని కేటాయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

చలో ఢిల్లీ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నవతెలంగాణ -బోధన్

ఎస్సీ వర్గీకరణ సాధనకై కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 9వ తేదీన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించే మాదిగల మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బోధన్ పట్టణ నాయకులు కోరారు. ఈ సందర్భంగా సోమవారం బోధన్ పట్టణంలోని రాకాస్‌పేట్‌లోగల న్యూ అంబేద్కర్ కాలనీలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నాయకులు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ గత 30 సంవత్సరాలుగా విన్నవించిన ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని అన్నారు. దాంతో కేంద్ర ప్రభుత్వంతో తాడోపేడో చేసుకోవడానికి ఆగస్టు 9వ తేదీన మహా ధర్నా చేస్తున్నట్టు తెలిపారు. కావున ఈ కార్యక్రమానికి మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ సుధాకర్, టౌన్ ఇంచార్జ్ వీరపురం పోశెట్టి, అద్దంకి లింగన్న, తాళ్ల మహేందర్, రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ పెద్దింటి సురేష్, గుంజేరి సాయికుమార్, సందీప్, విజయ్, కృష్ణ, సాయి కృష్ణ, సాయి కుమార్, గౌతం, నడిపి పోశెట్టి, శీను, గుంజరి సిద్ధార్థ, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ కేటాయింపులో వివక్ష సరికాదు



మాట్లాడుతున్న డిహెచ్‌పిఎస్ నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

మతతత్వ బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు బడ్జెట్ కేటాయించే విషయంలో వివక్ష చూపడం సరైంది కాదని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) జిల్లా అధ్యక్షుడు కమలాపురం రాజన్న అన్నారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ పాలిత ప్రాంతాలకు ఒక న్యాయం, తెలంగాణకు ఒక న్యాయం ఏమిటని ప్రశ్నించారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నరేంద్రమోడీ కి సన్నిహితంగా ఉంటేనే బడ్జెట్ కేటాయిస్తానని చెప్పకనే చెబుతున్నటు బడ్జెట్ ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉందనే అక్కసుతో తెలంగాణకు బడ్జెట్ కేటాయించే విషయంలో మోడీ తీవ్ర అన్యాయం చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీకి ఎనిమిది మంది ఎంపీలను ఓట్లు వేసి గెలిపించిన పాపానికి తెలంగాణ రాష్ట్రంలో తిరిగే హక్కు లేదని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ కన్వీనర్ మాదరి నరేష్, కుంట మంగ తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో విధులు నిర్వహించినప్పుడే గుర్తింపు

- **ఎంఈఓ నాగనాథ్**

నవతెలంగాణ - బోధన్



ఉపాధ్యాయులు సాయాగౌడ్‌ను సన్మానిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులు నిబద్ధతతో విధులు నిర్వహించినప్పుడే వారికి ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తింపు లభిస్తుందని బోధన్ ఎంఈఓ నాగనాథ్ అన్నారు. సోమవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జెసి) రాకాసిపేట్ సోషల్ ఉపాధ్యాయులు సాయగౌడ్ ఉద్యోగ విరమణ సందర్భంగా బాబా గార్డెన్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ నాగనాథ్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందుతున్న ఉపాధ్యాయుడు సాయగౌడ్ తన విధి నిర్వహణలో ఏనాడు నిర్లక్ష్యం చేయలేదని, తన కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వహించి రాష్ట్రస్థాయిలో ప్రశంసలు పొందారని అన్నారు. అనంతరం ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, హూన్స గ్రామస్తులు సాయగౌడ్ దంపతులను శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం బాలచంద్రం, పిఆర్టీయు ఉపాధ్యాయ సంఘం నేత ఇల్తెపు శంకర్, ఎంబెల్లి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రానికి చెందిన బాధితునికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసినట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బుర్ర నారా గౌడ్ సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన పెద్దపుల్ల బాలయ్య అనారోగ్యానికి గురై ఆస్పత్రి పాలయ్యారు. నిరుపేద కావడంతో ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం అర్జీ చేసుకున్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు ఆదేశానుసారం బాధ్యత కుటుంబానికి 60 వేల వేల చెక్కును మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అందించారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు కాంగ్రెస్ పార్టీ నాయకులకు బాధ్యత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో. అధ్యక్షులు ప్రసాద్‌గౌడ్. సోషల్ మీడియా కోఆర్డినేటర్, నగేష్, మండల యూత్ అధ్యక్షులు రామగౌడ్, వైస్ ప్రెసిడెంట్ నవీద్, భాస్కర్ గౌడ్, శివ లాల్, మాజిత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం


ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామంలో ఇటీవల కాలంలో బ్రెయిన్ డెడ్‌తో మరణించిన ప్రవీణ్ కుటుంబ సభ్యులకు ఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రవీణ్ ఇంటిపై కప్పు కొరకు 20 వేల రూపాయల నగదును తిమ్మయ్య గారి సుభాష్ రెడ్డి తరపున కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రాజా గౌడ్, గ్రామస్తులు సాయగౌడ్, సతీష్ రెడ్డి, సుదర్శన్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

సోయా పంటకు ఎల్లో వైరస్

- మందు లేదు.. నివారణే మార్గం
- తెల్లదోమను నివారిస్తే వ్యాప్తి అరికట్టొచ్చు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని పలు గ్రామాలలో సోయా పంటకు ఎల్లో వైరస్ సోకింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఈ వైరస్ సోకితే సోయా పంట ఆకులు పసుపు రంగులోకి మారుతాయి. మొక్కలలో కిరణ జన్య సంయోగ క్రియ సరిగా జరగకపోవడంతో మొక్కల ఎదుగుదల లేక మొక్క ఎండిపోతుంది. ఎల్లో వైరస్ ఇది అంటువ్యాధి కావడంతో పంటంతా వ్యాప్తి చెంది భారీగా ఎండిపోయి దిగుబడి తగ్గుతుంది. ప్రస్తుతం మండలంలో ఎల్లో వైరస్ రైతుల చేలలో అక్కడక్కడ సోయా పంటకు కన్పిస్తుందని రైతులంటున్నారు. మండలం వ్యాప్తంగా సుమారు 18 వేల ఎకరాల్లో సోయా పంట సాగవుతుంది.

ఎల్లో వైరస్‌కు మందులేదు

ఎల్లో వైరస్ సోకిన సోయా పంటకు రసాయన మందులు లేనట్టు సమాచారం. ఈ వైరస్ సోకిన పంటను కాపడాలంటే తల ప్రాణం తోకకు వస్తుంది. రైకులకు, తాత్కలిక ఉపశమణం తప్పా ఎటువంటి మందులు లేవని పడంపల్లి రైతు లక్షెట్టి బాలాజీ అంటున్నారు. ఎల్లో వైరస్ అంటు వ్యాధి.. ఒక మొక్కకు సోకిందంటే రైతు జాగ్రత్త వహించాలి. ముందుగా వైరస్ సోకిన మొక్కలను తొలగించాలని, ఇతర పంటలతో కలిపి ఉంటే మిగలిన పంటకు సోకీ మొత్తం ఎండి పోయి కాత, పూత దశలోనే పంట ఎండి పోయి పెట్టుబడి తిరిగి రాదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇంత జరుగుతు న్నా.. వ్యవసాయాధి కారులు పట్టించుకోవడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ఎల్లో వైరస్ పంటకు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని రైతులు కోరుతున్నారు. పంటలకు సోకినది ఎల్లో వైరస్సా? ఇంకేదైనా ఉందా అనేది నిర్ధారించాలని, కానీ అటువంటి చర్యలేవీ తీసుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.


సోయా పంటకు సోకిన ఎల్లో వైరస్ చూపుతున్న రైతు

మందు లేదు.. నివారించొచ్చు
జుక్కల్ మండల వ్యవసాయాధికారి నవీన్‌కుమార్

సోయాకు ఎల్లో వైరస్ సోకిందని కొంత మంది గ్రామాల రైతులు కార్యాలయానికి మొక్కలను తీసుకొచ్చి చూపించారు. వైరస్ నివారణకు మందు లేదు. కానీ వ్యాప్తిని అరికట్టొచ్చు. ఎల్లో వైరస్ తెల్ల దోమ వలన ఒక మొక్క నుంచి ఇంకో మొక్కకు సోకుతుంది. తెల్లదోమను నివారిస్తే వ్యాప్తి ఆగిపోతుంది. వీటి నివారణకు మార్కెట్‌లో సైతం మందులు లభిస్తాయి. ఈ వైరస్ ఎందుకు వస్తుందంటే ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు మారడంతో మొక్కకు తక్కువ సూర్యరశ్మీ వలన పంటకు కాండం తొలుచు ఈగ, పల్లాకు తెగులు (యెల్లో మేజాయిక్ వైరస్) ఆశించడానికి అనూకూలం. వీటీ లక్షణాలు గుర్తించినట్టయితే కాండం తొలుచు , ఈగ నివారణకు ఎసీఫేట్ మందును లీటరు నీటీతో కలిపి వర్షాలు లెనప్పుడు పిచికారి చేయాలి. పల్లాకు తెగుళ్లకు 0.2 మిల్లి గ్రాము ఎసిటా మిప్రిడ్ లేదా థయేమితాక్సన్ లీటరు నీటీతో కలిపి వర్షాలు తగ్గిన తరువాత పిచికారి చేయాలి.

ఆగ్రో సంస్థ చైర్మన్ కాసులకు సన్మానం


కాసుల బాల్‌రాజ్‌ను సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజును బీర్కూర్ మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు ఘనంగా సన్మానించారు. సోమవారం బీర్కూర్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో బరంగెడ్గి గ్రామానికే చెందిన సీనియర్ నాయకులు, మైలారం సొసైటీ మాజీ చైర్మన్ అప్పారావు, సీనియర్ నేత నర్సరాజు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆగ్రో సంస్థ చైర్మన్ కాసుల బాలరాజు మాట్లాడుతూ మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కావాలని వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలుపొందాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రినుంచి మాజీ ఎమ్మెల్యే డిశ్చార్జి

- ఇటీవల అస్వస్థతకు గురవడంతో చికిత్స పొందిన జాజాల సురేందర్


కోలుకుంటున్న జాజాల సురేందర్

నవతెలంగాణ-లింగంపేట్

అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరిన ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ సోమవారం ఆస్పత్రిని డిశ్చార్జీ అయ్యారు. ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ వల్ల తీవ్ర అస్వస్థతకు గురై అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ లోని కిమ్స్ ఆసుపత్రిలో 15 రోజులగా చికిత్స పొందారు. ఆయన ఆరోగ్యం మెరుగవడంతో ఆసుపత్రి నుండి ఇంటికీ డిశ్చార్జ్ చేశారు.

మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ మాట్లాడుతూ ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజల దీవెనలు ఆ భగవంతుని ఆశీస్సులతో త్వరగా కోలుకున్నానని సోమవారం ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అవుతున్నానని తెలిపారు. వైద్యులు మరికొన్ని వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలని సూచించారని తెలిపారు. 'నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ప్రతి ఒక్కరికీ నా మనవి నన్ను పరామర్శించటానికి హైదరాబాద్ ఎవరు రావద్దని, మీ ముందుకు నేనే త్వరలో వస్తా' అని తెలిపారు.

కాంగ్రెస్‌లో పోచారం చేరిక..

అభివృద్ధికి కాదు.. కొడుకు బిల్లుల కోసమే

- కాంగ్రెస్‌ను గ్రూపులుగా విడగొట్టడం మానండి
- గ్రంథాలయాల సంస్థ జిల్లా మాజీ చైర్మన్ దివిటి శ్రీనివాస్

నవతెలంగాణ-బాన్సువాడ (నసురుల్లాబాద్)

ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి బాన్సువాడ నియోజకవర్గం అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరినట్టు చెబుతున్నాడని, కానీ కాంట్రాక్టర్ అయిన తన కొడుకు బిల్లుల కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరారని జిల్లా గ్రంథాలయాల మాజీ చైర్మన్ దివిటి శ్రీనివాస్ ఆరోపించారు. సోమవారం బాన్సువాడ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి నివాసంలో నియోజకవర్గస్థాయిలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం రైతుల సంక్షేమం కోసం పార్టీ మారినట్లు చెప్పడం పచ్చి అబద్ధమని, కేవలం అతని కొడుకుల బిల్లులు మంజూరు చేయించు కోవడం కోసమే పార్టీ మారారని అన్నారు. నియోజక వర్గంలో కాంట్రాక్టు పనులు చేసిన మాజీ సర్పంచులు ఎంపీటీసీలు కాంట్రాక్టర్లు బిల్లులు రాక ఇబ్బంది పడుతుంటే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పార్టీ మారి కేవలం అతని కొడుకు బిల్లులు రూ.5 కోట్ల 35 లక్షలు మంజూరు చేసుకున్నారని, దీని కోసమే వారు కాంగ్రెస్ పార్టీలో చేరారని ఆరోపించారు. అందుకు సంబంధించి తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని అన్నారు. ఇకనైనా పోచారం అబద్ధాలు అసత్యాలు చెప్పడం మాని వాస్తవాలు మాట్లాడాలని కాంగ్రెస్ పార్టీని గ్రూపులుగా విడగొట్టే పనులు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాసాని శ్రీనివాస్‌రెడ్డి, గంగాధర్, శివరాజ్ దేశాయ్ , హనుమాన్లు, కమలాకర్ రెడ్డి, మంత్రి గణేష్ ప్రతాప్ సింగ్ రాథోడ్, సాయిలు, దశరథ్ నాయక్, వెంకట్‌రెడ్డి, వాహిద్ హుస్సేన్, అమృత్ రెడ్డి రాంబాబు, చందర్ నాయక్, బాడీ శీను దత్తు, దేవేందర్ పాల్గొన్నారు.


సురేందర్‌రెడ్డికి ఇటీవల మంజూరైన బిల్లులు చూపుతున్న కాంగ్రెస్ నాయకులు

పీఆర్‌టీయూ మండల కమిటీ ఎన్నిక


ప్రమాణస్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

నవతెలంగాణ-సదాశివనగర్

పీఆర్‌టీయూ సదాశివనగర్ మండల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు దామోదర్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ కుశాల్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు. మండల అధ్యక్షుడిగా గాదరి రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జె బసంత్‌రాజ్, ఉపాధ్యక్షులుగా బాలకిషన్, కార్యదర్శిగా సాయిరెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలుగా సువర్ణ, మహిళా కార్యదర్శిగా ప్రశాంతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజిరెడ్డి బసంత్ రాజ్ మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు జిల్లా కార్యవర్గానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ముందుంటామని తెలిపారు.

ఆలయ అభివృద్ధికి దాతలు స్పందించాలి


మద్నూర్‌లోని ఆలయం

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో గల పురాతనమైన ఆంజనేయ స్వామి ఆలయం భారీ వర్షాల మూలంగా ఊరుస్తోంది. గ్రామ ప్రజలకు అత్యంత ముఖ్యమైన శుభ కార్యక్రమాలకు ఈ ఆలయం ప్రఖ్యాతగాంచింది. గ్రామంలో ఎవరు పెళ్లిళ్ల చేయాలన్నా ఈ ఆలయం నుండే పెండ్లి కుమారులకు సేవన్లాల శోభ యాత్ర ఉంటుంది. ముఖ్యమైన ఆలయం భారీ వర్షాలకు ఉరుస్తుండడంతో ఆలయ పైకప్పును మరమ్మతులు చేయాలని, గ్రామ ప్రజలు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి సహకరించాలని కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

అవగాహనతో సైబర్ మోసాలకు అడ్డుకట్ట

- కస్తూర్బా విద్యార్థులకు సదస్సు

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల యందు పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు షీటీం, సైబర్ నేరాలు, మూఢనమ్మకాలు, రోడ్డు భద్రత, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా నిర్మూలన, డ్రగ్, మత్తు పదార్థాలు తదితర అంశాలపై అవగాహన సదస్సు సోమవారం కల్పించారు. ఈ సందర్భంగా నిజంసాగర్ ఎస్సై కే.సుధాకర్ మాట్లాడుతూ.. టెక్నాలజీ ఏ విధంగా పెరుగుతుందో సైబర్ నేరాలు కూడా అదే విధంగానే పెరిగిపోతున్నాయన్నారు. సైబర్ నేరాల గురించి ఆయన విద్యార్థులకు వివరించారు. ఫోన్లో అనవసరమైన లింకులను ఓపెన్ చేయకూడదని వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికి కూడా ఇవ్వకూడదని ఆయన విద్యార్థులకు సూచించారు. బ్యాంకు నుంచి ఓటిపిలు ఎవరు అడగరని కేవలం సైబర్ నేరగాళ్లు మాత్రమే ఓటిపిలు అడుగుతారని, ఎట్టి పరిస్థితిలో ఓటీపీలు ఎవరికి చెప్పకూడదని అంతగా ఏదైనా సమస్య ఉంటే బ్యాంకుకు వెళ్లాలని ఆయన సూచించారు. సైబర్ నేరాలకి గురైతే వెంటనే 1930కి ఫోన్ చేయాలని అత్యవసర పరిస్థితులలో 100,108 నంబర్లకి ఫోన్ చేయాలని ఆయన అన్నారు.

రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చాలని, ప్రతి ఒక్క విద్యార్థి రోడ్డు భద్రత గురించి తెలుసుకోవాలని ఆయన అన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు గనుక ప్రతి ఒక్క విద్యార్థి బాగా చదువుకోవాలని బాల్యవివాహాలు ఎవరు కూడా చేసుకోకూడదని బలవంతంగా ఇంట్లో బాల్య వివాహం చేస్తే పోలీసులకు గానీ ఉపాధ్యాయుల గాని సమాచారం ఇవ్వాలని అయినా అన్నారు. షీటీం గురించి సహాయం కావాలంటే 8712686094 నంబర్‌కి కాల్ చేయాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్ శాఖ కళాబృందం సభ్యులు, పాఠశాల సిబ్బంది ప్రభాకర్, సాయిలు, శేషారావు, తదితరులు పాల్గొన్నారు.



పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన విద్యార్థినులు

మురికి కాలువల పూడికతీత


పూడికతీత పనులు చేపడుతున్న కార్మికులు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల కేంద్రంలోని మురికి కాలువల్లో పూడికతత పనులు చేపట్టినట్టు గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రావణ్ కుమార్ తెలిపారు. లింగంపేట గ్రామపంచాయతీ పరిధిలోని మురికి కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి పిచ్చి మొక్కలు పేరుకుపోవడంతో పిచ్చి మొక్కలను చెత్తచెదారాన్ని తొలగించినట్టు తెలిపారు. అదేవిధంగా గ్రామ పంచాయతీకి సంబంధించిన బోరు మోటర్ కాలిపోవడంతో దాన్ని మరమ్మతు చేస్తున్నామన్నారు. గ్రామ ప్రజలు చెత్తాచెదారాన్ని చెత్త ట్రాక్టర్లలోనే వేయాలని సూచించారు.

చినుకు కురిస్తే చెరువే

- వర్షాకాలంలో చెరువును తలపిస్తున్న రెంజల్ తహసీల్దార్ కార్యాలయం


తహసీల్దార్ కార్యాలయంలో నిలిచిన నీరు

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ మండలం తహసీల్దార్ కార్యాలయం.. చినుకు కురిస్తే చాలు చెరువును తలపిస్తోంది. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు, ఉద్యోగులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. కార్యాలయం ఆవరణ మొత్తం నీటితో నిండుకోవడంతో కార్యాలయంలో పని కోసం వచ్చే వారికి తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. కుంటను తలపిస్తోంది. నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

పెసర పంటకు తెగుళ్లు

- వరుస వర్షాలతో మందుల పిచికారికి ఆటంకం

నవతెలంగాణ-మద్నూర్

మండలంలో సాగుచేసిన పెసర పంటకు తెగుళ్ల వచ్చాయి. పంటకు వచ్చిన తెగుళ్లతో పెసర పంట నష్టంతో రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వానాకాలం పంట సాగులో భాగంగా మండలంలో రైతులు పెద్ద మొత్తంలో పెసర పంట సాగు చేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పెసర పంట ఖాతా పూత దశకు వచ్చినా దానికి తెగుళ్ల సోకడంతో పంట ఆకులు మాడిపోతున్నాయి. పూత ఖాతా పూర్తిగా దెబ్బతింటున్న పంటను రైతులు తీసుకువచ్చి పురుగుల మందుల షాపుల యజమానులకు చూపించారు. ఇలాంటి పెసర పంట నష్టానికి ఎలాంటి మందులు వాడాలి అంటూ అడుగుతున్నారు. పంటకు తెగుళ్ల రావడంతో ఆకులంతా మాడిపోయి పంట పూర్తిగా దెబ్బతిన్నట్లు పెసర పంట రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 15 రోజులుగా వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్నాయి. పంటలకు పురుగు మందులు వాడాలన్న వర్షం గరువు ఇవ్వడం లేక పంట తెగుళ్ళకు పిచికారి మందు ఆలస్యం కావడంతో పెసర పంట పూర్తిగా దెబ్బతింటున్నట్టు రైతులు వాపోతున్నారు.

పంటలకు పిచికారి మందులు కొట్టడానికి బారులు తీరిన రైతులు

మండలంలో వానాకాలం పంట సాగులో భాగంగా వ్యవసాయ రైతులు అత్యధికంగా పెసర, మినుము, సోయా, పత్తి, కంది, పంటలు సాగు చేశారు. ఈ పంటలకు దాదాపు 15 రోజులకు ఒకసారి పిచికారి మందు వాడవలసి ఉండగా గత 15, 20, రోజులుగా అల్పపీడన ప్రభావం మూలంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సాగు చేసిన పంటలకు పురుగుమందు పిచికారి చేయడానికి ముసురు వర్షాలు సమయం ఇవ్వలేకపోగా సోమవారం వాన తగ్గింది.. వాన లేదు అనుకుంటూ వ్యవసాయ రైతులు పిచికారి మందుల కోసం ఫర్టిలైజర్ షాపులకు బారులు తీరారు. ఉదయం వాన లేదు అనుకోని పిచికారి మందులు కొనుగోలు చేయగా మధ్యాహ్నం మళ్ళీ వాన ప్రారంభమైంది. ఈపాటికి పురుగుమందులు పిచికారి చేయలేక సాగు చేసిన పంటలు దెబ్బతింటున్నాయని ఆందోళన చెందుతున్నారు. మధ్యాహ్నం కురిసిన వాన మరింతగా ఆందోళన కలిగించిందని, కొంతమంది రైతులు ఉదయం నుంచి పంటలకు పిచికారి మందులు పంపుల ద్వారా పిచికారి చేయించగా మధ్యాహ్నం వాన రావడం పిచికారి మందు పని చేస్తుందో లేదో అనే ఆందోళన రైతన్నల్లో వ్యక్తమైంది. ఏది ఏమైనా కొద్దిపాటి గరువు దొరుకుతే పిచ్చిగారి మందులు వాడెందుకు రైతులంతా పురుగుమందుల కొనుగోలు చేస్తున్నారు. పంటలకు సోకే తెగుళ్లపట్ల వ్యవసాయ అధికారులు పంటలను పరిశీలించి తెగుళ్ల నివారణ చర్యలు రైతులకు తెలియజేయాలని వ్యవసాయదారులు వ్యవసాయ శాఖ అధికారులను కోరుతున్నారు.



మందులు కొనుగోలుకు మొక్కను తీసుకొచ్చిన రైతు

ఎన్ఎస్ఎఫ్ కార్మికుల సమాలోచనలు

నవతెలంగాణ-బోధన్

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అసెంబ్లీ సమావేశాలలో బోధన్ నిజాం ఫ్యాక్టరీని తెరిపిస్తామని ప్రకటించడంతో కార్మికులు సమాలోచనలు చేస్తున్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కార్మికులు ఎలాంటి కార్యాచరణ రూపొందిస్తారని స్థానికంగా చర్చనీయాంశం అయింది. ప్రభుత్వం ఫ్యాక్టరీని ఓపెన్ చేస్తుందా.. లేదా.. అంటూ అనుమానాలు సైతం వ్యక్తమవుతున్నాయి. గతంలోనూ ఇలాగే హామీలు ఇచ్చి విస్మరించిందని మళ్లీ అలాగే చేస్తారేమోనని కార్మికులు అనుమానిస్తున్నారు. ఫ్యాక్టరీని వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటేనే నమ్మకం కలిగే అవకాశం ఉంది. ఫ్యాక్టరీ ప్రారంభించడానికి ముందు కార్మికుల బకాయి వేతనాల పై ప్రభుత్వం ప్రకటన చేయకపోవడం ఫ్యాక్టరీ జాయింట్ వెంచర్ రద్దుచేసి ఫ్యాక్టరీ యాజమాన్యానికి అప్పగించిన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ప్రభుత్వ ఆధీనంలో నడిపించాలని కార్మికులు చర్చించుకున్నట్టు సమాచారం. అలాగే బ్యాంక్ అప్పులు 43 కోట్లు చెల్లించిన ప్రభుత్వం, కానీ కార్మికులకు బకాయి వేతనాలను కనీసం 10కోట్ల రూపాయలు ఎందుకు ఇవ్వలేదన్న ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా వంగపల్లి వార్ యోగేష్



నవతెలంగాణ-మద్నూర్

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా రెండవసారి వంగపల్లి వార్ యోగేష్ ఏకగ్రీవంగా సోమవారం ఎన్నికయ్యారు. ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి కృషి చేస్తున్నందున ఆయనకే మళ్లీ కులస్తులంతా రెండోసారి అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కులస్తులు తెలిపారు. ఈ సందర్భంగా యోగేష్ మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులు తమపై నమ్మకంతో రెండోసారి అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు కుల పెద్దలు, కులస్తులకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు



నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని మంగల్‌పహాడ్ గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యమైంది. ఎడపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగల్‌పహాడ్ గ్రామానికి చెందిన భూరేడి రాధా కుమార్తె బూరెడి పూజ (21) ఈనెల 24న మగ్గం పనుల వస్తువులకోసం నిజామాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తానని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో బంధువులకు, స్నేహితుల వద్ద ఆచూకీ కోసం ప్రయత్నించారు. బూరెడి పూజ తల్లి రాధా ఎడపల్లి పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుగుతున్నట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

- బస్సు ఎక్కబోయి కాలుజారి పడడంతో

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

ఓమహిళ బస్సు ఎక్కబోయి కాలుజారి పడి మృతి చెందింది. జక్రాన్‌పల్లి బాలనగర్ గ్రామానికి చెందిన నర్ర గంగామణి (35) ఈనెల 27న రాత్రి సమయంలో కూలిపని రిత్యా నిజామాబాద్‌కు వచ్చింది. తిరిగి తన గ్రామాన్ని వెళ్లడానికి బైపాస్ రోడ్‌లో దూరం నుండి బస్సును గమనించింది. దాని వద్దకు పరిగెత్తే క్రమంలో ఒకవైపు వర్షంతో రోడ్డు బురదగా ఉండటంతో కాలుజారి కింద పడింది. తలకు తీవ్ర గాయం కాగా ఆమెను నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి నిజామాబాద్ చేర్పించారు. చికిత్స పొందినా పరిస్థితి విషమించి ఆదివారం ఆమె మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న ఆమె అన్న శివరాత్రి లక్ష్మణ్ పిఎస్ నిజామాబాద్ రూరల్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఎస్సై మహేష్ గంగామని శవాన్ని పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వదిన మరదళ్ల గాజులు

- సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు
- సోషల్ మీడియా ద్వారా ప్రచారం

నవతెలంగాణ-ఆర్మూర్

ఆషాఢ మాసం నేపథ్యంలో జిల్లాలో ఎక్కడ చూసినా అక్కాచెల్లెళ్ళు, వదినె మరదళ్ల గాజులు.. మనుమళ్లు మనవరాళ్లకు, అమ్మమ్మలు కుడుకలు పెట్టే ట్రెండు జోరుగా నడుస్తుంది. కొత్త కొత్త సాంప్రదాయాలకు శ్రీకారం చుట్టడం ఇటీవల సోషల్ మీడియాలో చర్చనీయంగా మారింది. కొత్త కొత్త ఆచారాలు, పద్ధతులు కొందరిని ఆశ్చర్యానికి గురి చేస్తున్న తప్పనిసరి పాటించాల్సిన పరిస్థితి కల్పించడమే విడ్డూరంగా ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

చేతికి సింగారం గాజులు..

గతంలో మహిళలు చేతినిండా మట్టి గాజులతో కనిపించేవారు ..ఆ తర్వాత తరం స్త్రీలు సగానికి సగం తగ్గించారు. ఒకానొక దశలో ఒక చేతికి వాచ్ మరో చేతికి ఒక గాజుకు పరిమితమయ్యారు. కాగా ప్రస్తుతం రంగురంగుల గాజులను చేతినిండా ధరించడం చూస్తున్నాం. మట్టి గాజుల తర్వాత సీసం, రాగి, అల్యూమినియం ఇతరత్రా లోహపు గాజులు వచ్చాయి.



పేద, మధ్యతరగతి బాలికలు యువతులు ఈ గాజులను వేసుకుంటే శ్రీమంతులు బంగారు గాజులు వేసుకునే వారు. ఇంద్రధనస్సును సైతం వెలవలబోయే కాంతులతో మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. నేటి తరం వేసుకునే దుస్తుల రంగులకు అనుగుణంగా గాజులను ధరిస్తున్నారు.

అన్న తమ్ముళ్లకు సైతం....

కొన్ని సంవత్సరాల క్రితం అన్న తమ్ముళ్లకు సైతం చక్కెర కుడకలు పోయాలి అని కొత్త సాంప్రదాయం కూడా వైరల్‌గా మారింది. సొంత అన్నదమ్ములు లేని ఆడపడుచులు తమకు వరుసకు అన్నదమ్ములయ్యే వారికి కుడుక చక్కెర పోసి సంబరపడ్డ సందర్భాలు ఉన్నవి.

నెట్టింట వైరల్ అవుతున్న పుకార్లు...

కొన్ని పుకార్లు ఎక్కడినుంచి పుట్టుకొస్తాయో తెలియదు కానీ క్షణాల్లో నెట్టింట వైరల్‌గా మారుతున్నాయి. ఒకరిద్దరూ వాటిని పాటించి చూపించడంతో మిగతావాళ్లు ఫాలో అవుతున్నారు. ఆడపడుచులకు గాజులు పెట్టాలి లేకపోతే వాళ్లకు మనకు దూరం బాగా పెరిగిపోతుందట, మాటల్లో తేడాలొస్తాయట అంటూ పుకార్లు పుట్టుకొస్తున్నాయి. దీంతో అవన్నీ కొని తెచ్చుకోవడం దేనికి గాజుల షాపులో ఓ నాలుగు డజన్ల గాజులు కొని మన ఆడపడుచులకు పెట్టేస్తే సరిపోతుంది అని మహిళలు షాపింగ్‌లు చేస్తున్నారు. కాగా మహిళల షాపింగ్‌లతో ఆగిపోక ఇంటికి వచ్చిన వారికి మర్యాద చేయకుంటే బాగుండదు కదా ఈ సమయంలో ఇంట్లో డబ్బులు లేకపోయినా అప్పు చేసిన సరే ఏదో ఒకటి చేయాలని గాజులు వేసిన వదినకు చీర జాకెట్ పెట్టి సాగనంపుతున్నారు. కాగా ఉమ్మడి జిల్లాలోని ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల్లోని పలు గ్రామాలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పుణ్యమా అంటూ దుకాణదారుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది

రేపు అసెంబ్లీ ముట్టడి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఈనెల 31న నిర్వహించే ఛలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిడిఎస్‌యూ, పివైఎల్ నాయకులు పిలుపునిచ్చారు. రాష్ట్ర బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 31న చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టినట్టు పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, పివైఎల్ జిల్లా అధ్యక్షులు వనమాల వనమాల సత్యం తెలిపారు. నిజామాబాద్ నగరంలోని నీలం రామచంద్రయ్య భవన్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో విద్యారంగాన్ని గాడిలో పెట్టేందుకు కనీసం 15 శాతం నిధుల కేటాయిస్తామని చెప్పి రాష్ట్ర బడ్జెట్ లో 7.3 శాతం నిధులు మాత్రమే కేటాయించారని అన్నారు. పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్‌లు, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, ద్యోగాల ఖాళీలపై అసెంబ్లీలో స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖకు మంత్రిని నియమించాలని. వీసిలను నియమించాలని, రాష్ట్ర ప్రభుత్వ వైద్యశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. అంటువ్యాధులు, విష జ్వరాలు ప్రబలకుండా ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. సమావేశంలో పిడిఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి ప్రిన్స్, పివైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు బండమీద నర్సయ్య, సహాయ కార్యదర్శి తంకడి భాస్కర్, నగర నాయకులు నిఖిల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌ఫామ్ సాగుతో.. రైతుకు లాభం



మాట్లాడుతున్న ఉద్యాన శాఖ అధికారులు

నవతెలంగాణ-ఏర్గట్ల

ఆయిల్ ఫామ్ సాగుతో రైతుకు లాభదాయకంగా ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారించిందని ఉద్యాన శాఖ అధికారి రుద్ర వినాయక్ అన్నారు. బట్టాపూర్ గ్రామంలో రైతు కట్కం సామంత్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఫ్రీ యూనిక్ కంపెనీ ఏర్గట్ల మండల ఆయిల్ ఫామ్ క్లస్టర్ అధికారి ప్రేమ్ సింగ్‌తో కలిసి ఆయిల్ ఫామ్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖ అధికారి వినాయక్ మాట్లాడుతూ... ఆయిల్ ఫామ్ సాగు కోసం రైతుకు రాష్ట్రప్రభుత్వం నుండి ఎకరానికి 9 వేల రూపాయలు, ఎరువులు, అంతర పంట పెట్టుబడి సహాయం కోసం 4200 రూపాయలను నాలుగు సంవత్సరాలు, ప్రతి సంవత్సరం సబ్సిడీని నేరుగా రైతు ఖాతాలో జమచేస్తుందని అన్నారు. మరిన్ని వివరాల కోసం ఏర్గట్ల మండల ఉద్యాన అధికారి రుద్ర వినాయక్, 8977713982 ఫోన్ నంబర్ ను సంప్రదించాలని కోరారు.

సౌండ్ సిస్టం వితరణ



విరాళం అందజేస్తున్న అధ్యక్షులు రజనీష్ కిరాడ్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ కేంద్రంలోని రాంనగర్‌లోగల రామాలయంలో సౌండ్ సిస్టం పూర్తిగా పాడై పోవడంతో యాజమాన్యం అభ్యర్థుల మేరకు అధ్యక్షులు రజనీష్ కిరాడ్ స్పందించి సుమారు నాలుగువేల రూపాయలు విలువగల సౌండ్ సిస్టంను ఆలయ కమిటీ ఛైర్మెన్ కొక్కుల లింగంకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ.. భవిష్యత్తులో మందిరానికి సౌండ్‌కు సంబంధించి ఏమైనా సమస్యలు ఏర్పడితే ఉచితంగానే చేయించి ఇస్తామన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు రోటరీ సేవలు అనిర్వచనీయమని అభినందిస్తూ అధ్యక్షులు రజనీష్ కిరాడ్‌కు శాలువతో సత్కారించారు. పూజారి వెంకటరమణా చారి రోటరీ సభ్యులందరికీ రాములవారి ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి రాస ఆనంద్, కోశాధికారి పిట్ల శశిధర్, కార్యవర్గ సభ్యులు పుష్పాకర్ రావు, ప్రవీణ్ పవర్, ఆలయ కమిటీ చైర్మన్ కొక్కుల లింగం, విశ్రాంత ఉపాధ్యాయులు, పూజారి వెంకటరమణా చారి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శాఖలో బదిలీలు

నవతెలంగాణ-పోతంగల్



మండలంలోని ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ సాధారణ బదిలీల్లో భాగంగా డిప్యూటీ డిఎంహెచ్‌ఓ కార్యాలయం, నిజామాబాద్ డివిజన్ కార్యాలయంనకు, జ్యోతి సూపర్‌వైజర్ వర్ని, సాయికుమారి సూపెర్వైసర్ సాలూర బదిలీ అయ్యారని అధికారులు తెలిపారు. వీరు మండలంలో ప్రతి గ్రామానికి తిరిగి సేవలను అందించినందుకు ప్రజలు వారికి ధన్యవాదాలు తెలిపారు.

కుటుంబం ఉన్నా.. అనాథగా..

- ఆదుకోవాలని ఓ తల్లి విన్నపం

నవతెలంగాణ-పోతంగల్

ఇద్దరు కుమారులు ఉన్నా తల్లి మాత్రం అనాధగా మిగిలింది. చూసేవారు లేక ఒంటరిగా బతుకు తున్నది. వివరాల్లోకి వెళితే.. మండలకేంద్రంలోని పాత పోతంగల్‌కు చెందిన గోవూరు గంగవ్వకు ఇద్దరు కుమారులు.. చిన్న కుమారుడు బతుకుతెరవుకు దుబాయ్‌కు వెళ్లగా..



గోవూరు గంగవ్వ

పెద్దకుమారుడు కొరు ట్లకు వెళ్ళాడు.. ప్రస్తుతం గంగవ్వకు(70) తనకు గోవూర్ రమేష్, పబ్బ శేఖర్‌లు కలసి గ్రామంలో ఉన్న డాక్టర్‌కు చూయించి మందులను ఇప్పించి బిసి కమ్యూనిటీ హాల్ దగ్గర ఉంచారు. తరచుగా గ్రామస్తులు తనకు ఏదో ఒకటి పెట్టడంతో రోజులు గడుస్తున్నాయి. తమ సమీప బంధువు జి.భూపతి చొరవ తీసుకొని, బంధువులతో చర్చించి, ఆమెకు సహాయం చేయాలని నిర్ణయించారు.

కుమారులకు మరోసారి విషయం తెలిపిన స్పందించలేదని, తనకు ఉన్న కొద్దిపాటి పొలాన్ని కుమారులు అమ్మాలని చూసినా అమ్మనివ్వకుండా, తల్లి జీవించినంత వరకు తనకే ఉంచి ఆదుకోవాలని తెలిపారు. ఇప్పటికైనా, అధికారులు, ప్రజలు చొరవ తీసుకొని, తనకు సహాయం చేయాలని దీనావస్థలో ఉన్న ఒక తల్లి చేతులెత్తి వేడుకొంటున్నది.

ఇంగ్లీష్ టీచర్ శిరీష సస్పెన్షన్ ఎత్తివేయాలి

- దివ్యంగా ఉద్యోగుల సంఘం

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డు పొందిన ఖమ్మం జిల్లా పెరువంచ గ్రామంలో పనిచేస్తున్న ఇంగ్లీష్ టీచర్ డి.శిరీష సస్పెన్షన్ ఎత్తివేయాలని దివ్యాంగుల ఉద్యోగుల సంక్షేమ సంఘం నిజామాబాద్ జిల్లా ఇన్చార్జి. బట్టు కృష్ణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు బాగా జుట్టు పెంచుకున్నారని, జుట్టు కత్తిరించుకొని పద్ధతిగా స్కూల్‌కు రావాలని కోరారని తెలిపారు. ఆ మాటలను పెడచెవిన పెట్టిన విద్యార్థులు ఎన్ని రోజులైనా అదే పద్ధతిగా వ్యవహరిస్తున్నారని, దీంతో టీచర్ చెబితే వినేలా లేరని తానే ఒక కత్తెర తీసుకువచ్చి అక్కడే కత్తిరించిందని పేర్కొన్నారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన విద్యార్థులు వారి తల్లిదండ్రుల వద్దకు వెళ్లి తమకు జరిగిన విషయాన్ని చెప్పి పాఠశాల మీదకు దండయాత్రకు వచ్చారని తెలిపారు. పిల్లలకు మంచి పద్ధతులు చెప్పాలనే ఉద్దేశంతోనే తను ఈ పని చేశానని, తల్లిదండ్రులు వెనుకేసుకొరావడం విడ్డూరంగా ఉందని ఆమె వ్యక్తం చేసిన ఆవేదనలో నిజం ఉందని పేర్కొన్నారు. కానీ విద్యాశాఖ అధికారులు మాత్రం ఆమె చేసిన పనిని తప్పుగా భావించి సస్పెన్షన్ చేయడం విడ్డూరంగా ఉందని తెలిపారు. ఏదైనా పొరపాటు జరిగితే ముందుగా షోకాజ్ నోటీస్ ఇచ్చి తర్వాత విచారణ చేసి ఉపాధ్యాయురాలు ఇచ్చిన వివరణతో సంతృప్తి చెందకపోతే ఇలాంటి చర్య తీసుకోవాలని పేర్కొన్నారు. ఎటువంటి వివరణ తీసుకోకుండా సస్పెండ్ చేయడం సరికాదని తెలిపారు. వెంటనే సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరారు.

అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ

రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా వాసులకు చోటు

- రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-కంఠేశ్వర్

అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ జాతీయ సాధారణ సర్వసభ్య సమావేశాలు, తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు ఖమ్మంలో ఈనెల 27 28 తారీకుల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సంస్థ జాతీయ అధ్యక్షులు అయ్యప్ప దాసు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ సంవత్సరం ఎనిమేలి దగ్గరలో గల నారాయణ తోడులో శబరిమల సీజన్, నెల పూజ సమయాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు కోసం శాశ్వత ప్రాతిపదికన అన్నదాన కేంద్రాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే భూసేకరణ జరిగిందన్నారు. ఈ సాధారణ సమావేశానికి తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్ నుండి పెద్ద సంఖ్యలో అయ్యప్ప సభ్యులు విచ్చేసి వివిధ తీర్మానాలు చేశారని అన్నారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుండి విచ్చేసిన అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యక్షులు కార్యనిర్వాహక సభ్యులు తెలంగాణ రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారని తెలిపారు. ఈ



మాట్లాడుతున్న పలువురు

కార్యవర్గంలో రాష్ట్ర అధ్యక్షుడిగా ఖమ్మం జిల్లాకు చెందిన టీవీ పుల్లంరాజు- రాష్ట్ర అధ్యక్షుడిగా, కార్యదర్శిగా బోధన్ కు చెందిన కర్కాసిద్దు, కోశాధికారిగా నిజామాబాద్‌కు చెందిన మూడ శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా నిజాంబాద్‌కు చెందిన ఇంజనీర్ గంగాధర్ గురుస్వామి ఎన్నికయ్యారని అన్నారు. కోశాధికారిగా ఎన్నికైన మూడవ శ్రీనివాస్ మాట్లాడుతూ.. శాశ్వత నారాయణ భవనానికి వీలైనంత ఎక్కువగా నిధులు సమీకరణలో సంస్థకు దగ్గరుండి సహకారాన్ని అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో నేషనల్ వెబ్ మాస్టర్ మాడవేడి సుధాకర్, జిల్లా నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు మక్తల్ మల్లేష్, కార్యదర్శి వంశిధర్ చౌదరి, కోశాధికారి గంగోని మధు, జాయింట్ సెక్రటరీ లక్ష్మణ్ , వాలంటరీ కమాండెంట్ రతన్ గురుస్వామి, కార్యవర్గ సభ్యుడు సంజీవంకర్ శంకర్ పాల్గొన్నారు.

వెండి చోరీ నిందితుడి అరెస్ట్

- 10కిలోల వెండిని స్వాధీనం చేసుకున్న రైల్వే పోలీసులు
- వివరాలు వెల్లడించిన రైల్వే ఎస్సై సాయి రెడ్డి



మాట్లాడుతున్న ఎస్ఐ సాయిరెడ్డి (పట్టకున్న వెండి)

నవతెలంగాణ-కంఠేశ్వర్

14.500 కిలోల వెండిని పాలిష్ కోసం తీసుకు వెళ్తున్న నిందితుడిని రైల్వే పోలీసులు అరెస్టు చేసినట్లు నిజామాబాద్ రైల్వే ఎస్సై సాయి రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం నగరంలోని రైల్వే పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గత నెల 28న నాందేడ్ కు చెందిన రాహుల్ అనే సిల్వర్ మర్చంట్ యజమాని తన దగ్గర ఉన్న సునీల్, నదీమ్ వర్కర్‌కు వెండి కాళ్ల పట్టిలు, తాడు మొత్తం 14.500 కిలోల వరకు ఇచ్చి హైదరాబాద్‌కు వెళ్లి పాలిష్ చేసుకొని రమ్మని పంపించారు. తీసుకొని వెళ్ళిన వర్కర్లు నదిమ్, సునీల్ నిజామాబాద్ ట్రైన్‌లో చేరుకునే సరికి ఉదయం ఒకటి అయ్యింది. ఇద్దరు వర్కర్లలో ఒకరు నదీమ్‌కు చెడు ఆలోచన వచ్చి సునీల్ పడుకోగానే తన వద్ద ఉన్న 14.500 కిలోల వరకు వెండి ఆభరణాలను దొంగిలించుకుని పారిపోయాడు. వెంటనే సునీల్ తన యజమాని అయిన్ రాహుల్ కి చెప్పాడు. ఆయన నిజామాబాద్‌కు చేరుకొని నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని వివరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తులో భాగంగా గాలింపు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. నెల రోజుల అనంతరం సోమవారం నదిమ్ హైదరాబాద్‌కు వెళ్లి తన వద్ద ఉన్న వెండి ఆభరణాలను అమ్ముకుందామని నిజామాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చాడని తెలిపారు. డ్యూటీలో ఉన్న కానిస్టేబుళ్లకు అనుమానం వచ్చి దగ్గరికి పోయేసరికి పారిపోతుండగా నిందితుడిని పట్టుకున్నారు. తనను విచారించగా తన వద్ద ఉన్న బ్యాగులో సొమ్ము ఉందని చూపించి తను చేసిన నేరం ఒప్పుకున్నాడని తెలిపారు. తన వద్ద ఉన్న బ్యాగు నుండి వెండి ఆభరణాలు అందాజా10కేజీలు చూపించాడు. అవి కేసులో ఉన్న వస్తువులని తెలియడంతో ఆయన్ను అరెస్టు చేసినట్టు చెప్పారు. మిగతా వెండి హైదరాబాద్, బోధన్‌లో విక్రయించారని నిందితుడు చెప్పాడని రైల్వే పోలీస్‌లు తెలిపారు. రికవరీ చేసిన వెండితోపాటు నిందితుడిని కోర్టులో హాజరు పరుస్తామని రైల్వే ఎస్సై సాయి రెడ్డి తెలియజేశారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-భీంగల్

ఈనెల 19 అర్ధరాత్రి బీఆర్ఎస్ కార్యకర్తపై దాడిచేసి గాయపరిచిన కాంగ్రెస్ కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని మండల బీఆర్ఎస్ నాయకులు కోరారు. సోమవారం పట్టణ కేంద్రంలోని సుమంగళి చౌరస్తా వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు నరసయ్య మాట్లాడుతూ.. జిల్లా కాంగ్రెస్ నాయకులు భీంగల్ మండలంలో ఇసుక దళారులను ప్రోత్సహించడంతో రోజురోజుకు వారి ఆగడాల మితిమీరిపోతున్నాయని, అడ్డుకున్న వారిపై దాడులు చేస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే ఈనెల 19న అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకున్న బీఆర్ఎస్ కార్యకర్తపై దాడిచేసి గాయపరిచారన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇప్పటివరకు వారిపై చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆగడాలు ప్రజలు గమనిస్తున్నారని వీరికి తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఇప్పటికైనా దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని లేకుంటే మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నాలు టిఆర్ఎస్ నాయకులు ఆర్మూర్ మహేష్, చౌట్పల్లి రవి, కన్నె సురేందర్, సుర్జిల్, మండల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు



ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
నిజామాబాద్-కామారెడ్డి
మంగళవారం | జులై 30, 2024 | www.navatelangana.com

తిరుమల కాలనీలో
వీధి కుక్కల స్వైర విహారం

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణంలోని తిరుమల కాలనీలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. తిరుమల కాలనీ నుండి శ్మశాన వాటిక వైపు వెళ్లే మార్గంలో వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తుండడంతో మహిళలు, చిన్నపిల్లలు భయపడు తున్నారు. రాత్రి వేళలో పాదాచారులు, ద్విచక్ర వాహన దారులను వీధి కుక్కలు వెంబడిస్తున్నాయి. అలాగే కాలనీలో పందుల బెడద కూడా నెలకొందని స్థానికులు తెలిపారు.


పురుగుల పండగ

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలో మంగళవారం పురుగుల పండుగను నిర్వహించాలని గ్రామస్తులు నిర్ణయించారు. పురుగులు, ఎలుకలు, పక్షుల నుంచి పంటలను రక్షించి, మేలు చేసే పక్షులను, జంతువులను, పురుగులను రక్షించాలానే ఉద్దేశంతో, శ్రావణ మాసం కంటే కొద్ది రోజుల ముందు ఈ పండుగను జరుపుకునే ఆనవాయితి ఉంది. ఈ పండుగను ఎలుకలు, చిలుకల పండుగ అని కూడా అంటారు. ఆ రోజు, వ్యవసాయదారులు పెద్ద చెరువు దగ్గర చేరి ఊరి దేవతలను పూజించి, మేకలను బలివ్వడం ఆనవాయితి. వాతావరణ మార్పుల వల్ల మనుషులు, జంతువులు, పక్షువులే కాక పంటలకు కూడా రోగాలు సోకుతాయని ఇక్కడి ప్రజలు నమ్ముతారు. అందుకే ఇక్కడి ప్రజలు పంటలు బాగా పండాలని, వ్యసాయం లాభసాటి కావాలని, పురుగులు, పక్షులు, జంతువుల బారినుంచి పంటలు కాపాడాలని ఈ పండగను జరుపుకుంటున్నామని తెలిపారు.

చిన్న ప్రాణి.. పెద్ద ప్రమాదం

- దోమలతో పొంచివున్న వ్యాధుల ముప్పు
- వైరస్ వ్యాప్తికి అనుకూలంగా తేమ
- పరిసరాల పరిశుభ్రత ముఖ్యం
- నీరు నిల్వలేకుండా చూసుకోవాలి




నవతెలంగాణ - నిజామాబాద్

వర్షాకాలం వాతావరణం మారడంతో పాటు అంటువ్యాధులు ప్రమాదం పెగుతుంది. దోమల నుంచి కంటికి కనిపించని వైరస్‌లు, బ్యాక్టీరియాలు ఈ సీజనలోనే వృద్ధి చెందుతాయి. ప్రధానంగా దోమకాటుతో ప్రజలు వ్యాధుల బారిన పడుతుంటారు. దోమ చిన్నదే కానీ దాని కాటు వల్ల వచ్చే వ్యాధులు మాత్రం చాలా ఉన్నాయి. డెంగ్యూ, చికున్‌గున్యా, మలేరియా, ఫైలేరియా, మొదడువాపు తదితర వ్యాధులన్ని దోమలు కుట్టడం ద్వారా వస్తాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సీజనల్ వ్యాధి వ్యాపిస్తుండడంతో వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల్లో అధిక శాతం దోమకాట వల్ల వస్తున్నవే.

ఈ కొలైన్, సాల్మోనెల్లా, రోటావైరస్ అనే వేల రకాల వైరస్‌లు, బ్యాక్టీరియాలు నీరు, ఆహారంలో కలిసినప్పడు అతిసార, డయేరియా వ్యాధులు వస్తాయి. కొన్ని రకాల వైరస్‌ల కారణంగా నీళ్ల విరేచనాలతో పాటు విరేచనాలు కూడా అయ్యే అవకాశాలున్నాయి. గాలిలో తేమ ఎక్కువగా ఉండడం, వర్షంలో తడవడం వంటి కారణాలతో జలుబుతో పాటు వైరల్ ఫీవర్‌లు కూడా నమోదయ్యే అవకాశముంది. సీజనల్ వ్యాధుల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించకుంటే ప్రాణాపాయస్థితి ఏర్పడుతుంది.

డయేరియా

కలుషిత నీరు, కలుషిత, నిల్వ ఉన్న ఆహరం తీసుకోవడం తదితరాలతో నీళ్ల విరేచనాలు అవుతాయి. రోజులో నాలుగు నుంచి ఐదుసార్లు విరేచనాలు అయితే డయేరియాగా భావించాలి. ఎక్కువ సార్లు విచోచనాలు అవడం వల్ల శరీరంలోని నీరు, లవణాలు, పోటాషియం, గ్లూకోజ్ తగ్గిపోయి రోగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోతాడు. బీపీ పడిపోవడం, గుండె వేగంగా కొట్టుకోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. రెండు మూడు నీళ్ల విరేచనాలు అయినప్పుడు తక్షణమే వైద్యుని వద్దకు వెళ్లి చికిత్స పొందడం మంచిది.



డెంగ్యూ జ్వరం

ఏడీస్ ఈ.ఈప్టి దోమకాటు వల్ల ఈ వ్యాధి సోకుతుంది. తీవ్ర జ్వరం తలనొప్పి, కీళ్ల నొప్పలు, కండరాల నొప్పులు, ఎముకల నొప్పులు, ఆకలి మందగించడం, శరీరంపై దద్దుర్లు, ముక్కు, మలం ద్వారా రక్తం పోవడం తదితర లక్షణాలు ఈ జ్వరం వచ్చిన వారిలో ఉంటయా.ఈ ఏడాదిలో ఇప్పటికి 50కి చేరుకున్నాయి.

చికున్ గున్యా

డెంగ్యూ జ్వరం లక్షణాలన్నీ ఈ వ్యాధి సోకిన వారిలో ఉంటాయి. రక్తస్రావం మూత్రం ఉండదు. తీవ్రమైన ఒళ్లు నొప్పులు దీర్ఘకాలం ఉంటాయి. జిల్లాలో రెండేళ్లుగా ఎలాంటి కేసుల నమోదు కాలేదని వైద్యాధికారులు తెలిపారు.

మలేరియా..

ఎనాఫిలిస్ దోమ కుట్టడం ద్వారా మలేరియా జ్వరం వస్తుంది. చలి వణుకుతో కూడిన విపరీతమైన జ్వరం వస్తూపోతూ ఉంటుంది. వ్యాధి లక్షణాలు పూర్తిగా బయటపడేందుకు రెండు వారాలు పడుతుంది. జ్వరం వచ్చినప్పుడు రక్త పరీక్షలు చేయిస్తే మలేరియా ఉందో లేదో తెలుస్తుంది. సరైన వ్యాధి నిర్ధారణ, చికిత్స చేయకపోతే నెలల తరబడి వేధిస్తుంది.

ఫైలేరియా

క్యూలెక్స్ దోమ ద్వారా ఫైలేరియా(బోధకాలు) వ్యాధి సోకుతుంది. తరుచుగా జ్వరం రావడం చంకల్లో గజ్జల్లో బిళ్లలు కట్టడం, శరీరంలోని అవయవాల వాపు ప్రత్యేకించి కాళ్ల, చేతులు, చాతీ వాపు ఈ వ్యాధి ముఖ్యలక్షణాలు. ఈ లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించి సకాలంలో వైద్యం చేయించాలి. లేదంటే బోధకాలుతో శాశ్వతంగా బాధపడాల్సి వస్తుంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వాక్సిన్లు, మందులు అందుబాటులో ఉన్నాయ.

మెదడు వాపు

క్యూలెక్స్ దోమ కాటువల్ల పందుల సంచారం వల్ల ఈ వ్యాది వస్తుంది. ఇది ఎక్కువగా 15ఏండ్లలోపు పిల్లలకు వస్తంది. చిన్నప్పుడే వాక్సిన్ వేయించడం వల్ల వ్యాధి వచ్చే అవకాశం తక్కువ. జ్వరం రావడం, తగ్గడం ఈ వ్యాధి లక్షణం. తగిన చికిత్స చేయించకపోతే పక్షపాతం, ఫిట్స్ వచ్చి శాశ్వతంగా దివ్యాంగులుగా మారే ప్రమాదముంది.

నియంత్రణ ఇలా..

దోమలను నియంత్రించాలంటే ఇంటిలోపల, బయట నీరు నిల్వలేకుండా చూసుకోవాలి. వారానికి ఒకసారి నీటి నిల్వలు లేకుండా ఇండ్లలో వారంలో ఒక రోజు డ్రైడేను పాటించాలి. ఇంటి అవరణలో కొబ్బరి చిప్పలు, కొబ్బరి బోండాలు, పాత టైర్లు, కూలర్లలో నీటి నిల్వలు లేకుండా చూడాలి. ఎయిర్ కూలర్‌లు, పూలకూండీలలో నీటిని మూడు రోజులకు ఒకసారి మార్చాలి. వారానికి ఒకసారి నీటి గుంతల్లో కిరోసిన్ వేయాలి. మున్సిపల్, పంచాయతీ అధికారులతో మాట్లాడి ఫాగింగ్ చేయించాలి. ఉదయం, సాయంత్రం కిటికీలు, తలుపులు మూసి ఉంచాలి. దోమకాటు వల్ల వచ్చే వ్యాధుల బారిన పడకుండా దోమ తెరలు తప్పనిసరిగా వాడాలి.

నిర్ధారణ పేరిట
రుణమాఫీకి జాప్యం



నవతెలంగాణ-నిజామాబాద్

లక్ష రూపాయల లోపు రైతులకు రుణమాఫీ జరిగినప్పటికీ కొందరికి రుణమాఫీ డబ్బులు అందక ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం ఆధార్, రేషన్‌కార్డును అనుసంధానంగా తీసుకోవడంతో బ్యాంకు అకౌంట్‌లో పేరు తప్పిదంతో నిర్ధారణ జరగలేదంటూ వారి డబ్బులు ఖాతాల్లో జమకు నోచుకోలేదు. దీంతో తమకు రుణమాఫీ వస్తుందా? లేదా అని రైతులు ఆధార్ కార్డు పట్టుకొని వ్యవసాయ అధికారుల వద్దకు వెళ్తున్నారు. ఇలా వందలో 25 శాతం మంది రైతులకు కుటుంబ సభ్యుల నిర్ధారణ జరగలేదని, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ రైతు పేరులో తేడా ఉందని రికార్డుల్లో ఉంది. దీంతో కొంతమంది రైతులు తమకు రుణమాఫీ వస్తుందా లేదా అని ఆందోళనకు గురవుతున్నారు. ఖరీఫ్ ప్రారంభం కావడం, రైతులంతా కష్టకాలంలో ఉన్న సమయంలో ప్రభుత్వం రుణమాఫీ చేస్తున్నప్పటికీ కొన్ని తప్పిదాల వల్ల కొందరు రైతులు రుణమాఫీకి నోచుకోవడం లేదు. ఏడు సంవత్సరాల నుండి ఇప్పటి వరకు కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ ప్రారంభించలేదు. ఆన్‌లైన్‌లో తప్పిదం మూలంగా రేషన్ కార్డులో కుటుంబ యజమాని పేరు మిస్ కావడంతో రుణమాఫీకి సంబంధించిన వ్యవసాయ శాఖ రికార్డుల్లో కుటుంబ సభ్యుల నిర్ధారణ జరగకపోవడంతో రుణమాఫీకి అర్హులమవుతామా? లేదా? అన్న ఆందోళన రైతులకు మొదలైంది. గ్రామాల్లో పెద్ద మొత్తంలో రైతుల రుణమాఫీ వివరాలు ఇదేవిధంగా ఉండటంతో టెన్షన్ మొదలైంది. విచారణ చేపడతామని వ్యవసాయ అధికారులు తెలియజేసినప్పటికీ, ప్రభుత్వం పూర్తి స్థాయిలో రుణమాఫీ డబ్బులు వేస్తుండడంతో ఇలా రైతుల పేర్లు మిస్ కావడంతో పూర్తిస్థాయిలో రుణమాఫీ అందడం లేదని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ అధికారులు తక్షణం సర్వే చేపట్టి వెనువెంటనే ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చి రుణమాఫీ చేయిస్తే రైతుకు కొంత న్యాయం జరుగుతుంది. నిర్ధారణ పేరిట ప్రభుత్వం కొందరు రుణాలను ఆపేసి జాప్యం చేస్తుందని రైతులు వాపోతున్నారు. నిర్ధారణ పేరిట రుణమాఫీ జాప్యం చేయవద్దని, సమస్యను తక్షణం పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

బద్ది పొచ్చమ్మ ఆలయంలో అన్నదానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని కోలిపుర కాలనీలో ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీబద్దీపొచ్చమ్మ ఆలయంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఆషాడం మాసం సందర్భంగా బోనాల పండుగను పురస్కరించుకుని ఆదివారం భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. సోమవారం ఆలయం ప్రత్యేక హారతులతో పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. పాడి పంటలు సమద్ధిగా కురిసి అందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని మనస్పూర్తిగా ప్రార్థించారు. అమ్మ దయ అందరిపై ఉండాలని వేడుకున్నారు.

గుండెపోటుపై అవగాహన

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సీపీఆర్‌పై అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం కమిషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ బాసెట్టి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్డియో, పల్మానరి, రిసిస్టేషన్ గుండెపోటు వచ్చినప్పుడు ఈ సీపీఆర్ విధానం ద్వారా ఎలాంటి మందులు ఇంజక్షన్లు అవసరం లేకుండా అంబులెన్స్ వచ్చేంత వరకు మనిషిని కాపాడవచ్చని తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాలలో విద్యార్థులకు సీపీఆర్ విధానం నేర్పుతున్నారని, మన దేశంలో వీటిపై అవగాహన లేకనే చాలా మరణాలు జరుగుతున్నాయని అన్నారు. పిడుగు పాటు రక్షణ, నవ సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయుడు పాత్ర, స్వామి వివేకానంద యువతకు ఇచ్చిన సందేశం విద్యార్థుల అభ్యున్నతికి ఉపయోగపడే వీడియోలను ప్రొజెక్టర్ ద్వారా చూపించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రవికుమార్, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ మాధవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని హవర్గ గ్రామానికి చెందిన పర్స భోజన్నకు అదే గ్రామానికి చెందిన లక్ష్మణ్‌కు రెండేళ్లుగా భూతగాదాలు ఉండగా జూన్ 24న వ్యవసాయ పనుల నిమిత్తం భోజన్న చేనుకు వెళ్లగా అప్పటికే లక్ష్మణ్, అతని భార్య గోదావరి అక్కడ ఉన్నారు. ఇరువురి మధ్య వాగ్వాదం జరగగా లక్ష్మణ్ చేతిలో ఉన్న పారతో భోజన్న తలపై కొట్టడంతో గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు నిర్మల్ ప్రభుత్వాస్పతికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. అప్పటి భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, ముధోల్ సీఐ మల్లేశ్, అప్పటి లోకేశ్వరం ఎస్సై మోహన్‌రావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు లక్ష్మణ్, గోదావరిపై కేసు నమోదు చేశారు. ఈ కేసు విషయమై భైంసా పట్టణానికి ఇటీవల కొత్తగా వచ్చిన ఏఎస్పీ అవినాష్ కుమార్ సోమవారం గ్రామంలో ఇరువర్గాలతో ఎస్సీ, ఎస్టీ కేసు విచారణ చేపట్టారు.

పెట్రోల్ బంకుల్లో నిబంధనలకు తూట్లు

- కనిపించని ప్రథమ చికిత్స, ఫిర్యాదుల పెట్టెలు
- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు

నవతెలంగాణ-నిజామాబాద్

నిజామాబాద్ జిల్లాలోని పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు చట్టబద్ధంగా అందించాల్సిన సేవలను నిర్వాహకులు గాలికి వదిలేస్తున్నారు. నిబంధనల ప్రకారం కల్పించాల్సిన మౌలిక సదుపాయాలకు తిలోదకాలు ఇస్తున్నారు. పెట్రోల్ బంకుల్లో ఇంధనాన్ని విక్రయించడమే కాదు.. వినియోగదారులకు వాటిలో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. కానీ అవి ఎక్కడ అమలు కావడం లేదు. పెట్రోల్ బంకుల్లో వినియోగదారుల వాహనాల టైర్లకు గాలిని ఉచితంగా నింపాలి. ప్రతి బంకుల్లో గాలి నింపే యంత్రం విధిగా ఉండాలి. వాహనదారులు టైర్లలో గాలి నింపమని కోరితే కొన్ని బంకుల్లో నిర్వాహకులు నిర్లక్ష్యం చేస్తున్నారు. గాలి యంత్రం పనిచేయడం లేదని తప్పించుకుంటున్నారు. వాహనాలకు గాలి నింపేందుకు నిర్వాహకులు తిరస్కరిస్తున్నారు. ఒకటి, రెండు చోట్ల మినహా చాలా చోట్ల యంత్రాలు కనిపించకుండా ఏర్పాటు చేసి వాడకుండా వదిలేస్తున్నారు. కొన్నిచోట్ల బంకుల్లో టైర్లకు గాలి నింపేందుకు సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారు. ద్విచక్ర వాహనానికి పది రూపాయలు నుండి 20 రూపాయలు వసూలు చేస్తున్నారు.



కనిపించని మరుగుదొడ్లు, తాగునీరు

ప్రతి బంకులో మరుగుదొడ్లు అందుబాటులో ఉండాలి. చాలామంది బంకుల నిర్వాహకులు మూత్రశాలల బోర్డులు పెట్టారు కానీ వాటి నిర్వహణ మరిచారు. పెట్రోల్ బంకుల వద్ద తాగునీటి వసతి కూడా ఉండాలి కానీ చాలా బంకుల్లో ఈ సౌకర్యం లేదు. తాగునీటి సదుపాయం కల్పించడానికి పంపు నిర్వాహకుడు ఆర్వో యంత్రం, వాటర్ కూలర్, వాటర్ కనెక్షన్ స్వయంగా పొందాలి. కానీ నిర్వాహకులు ఇదేం పట్టించుకోవడం లేదు.

వాహనదారుల సొమ్ముతోనే

పెట్రోల్ బంకుల్లో కనీస సౌకర్యాలను కల్పించడానికి వాటి నిర్వాహకులు సొంత డబ్బులు ఖర్చు పెడుతున్నది ఏమీ లేదు. అవి వినియోగదారుల నుంచి పన్నుల రూపంలో వసూలు చేస్తున్నవే, లీటర్ పెట్రోల్ లేదా డీజిల్ వినియోగదారుడు పెట్రోల్ బంకుల వారికి 4 నుండి 6 పైసల వరకు మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణ కోసం చెల్లిస్తున్నాడు. టాయిలెట్ నిర్వహణ వ్యయం కింద అన్ని పెట్రోల్ బంకుల్లో విరియోగదారుల నుండి ఈ విధంగా వసూలు చేస్తున్నాయి. సగటు పెట్రోల్ బంకుల్లో రోజుకు పదివేల లీటర్ల అమ్మితే టాయిలెట్ నిర్వహణ వ్యయం కింద ఆ బంకుకు వచ్చే ఆదాయం ఒక్క రోజుకి 600 రూపాయలు ఉంటే నెలకు 18000 వేలు అన్నమాట. వీటితో వచ్చిన డబ్బులతో టాయిలెట్ మంచినీటి ఇతర సౌకర్యాలు అందించాల్సిన బాధ్యత పెట్రోల్ బంకులదే. కాని ఇవేమి నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పెట్రోలు బంకుల్లో తనిఖీలు నిర్వహించాలని వాహనదారులు కోరుతున్నారు.

నామమాత్రపు తనిఖీలు

పెట్రోల్ బంకుల్లో సేవలపై సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలున్నాయి. పెట్రోల్ బంకుల వద్ద వినియోగదారులు తమకు జరిగిన నష్టంపై ఆందోళన చేసినప్పుడు మాత్రమే హడావుడి చేస్తున్న అధికారులు ఆ తర్వాత అటువైపు కన్నెత్తి చూడడం లేదు. అధికారులు తనిఖీ చేసి జరిమానా విధించవచ్చు. లేదా బంకులను మూసివేయవచ్చు. కానీ ఇప్పటివరకు ఇలాంటివి జరిగిన దాఖలాలు ఒకటి కూడా లేవు. నామమాత్రపు తనిఖీలతో చేతులు దులుపుకుంటున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు.